# ఉద్భవ

**స్త్రీ మరియు పిల్లల సంక్షేమం /**
**స్వేచ్ఛ / హక్కుల మాస పత్రిక**

Regn. No. 87195 (APTEL/2005/14638)

**Volume:19 Issue: 3 * June 2025 * Pages: 72 Rs.10**



Founder and Editor in Chief

**Dr. M. Madhava Vasu**

M.A., M.H.R., M.Phil (JMC), P.G.H.R., Ph.D., F.D.R. (Nalsar), B.P.R., DEE.

**Advisors:**

**Sri M. Madhusudhan Reddy**
Advocate

**Sri P. Balreddy**
Advocate

**Sri S. Mohan Rao**
Journalist

Kakinada Correspondent :
**Sri D. Venugopal Rao**


## లోపలి పేజీల్లో...


- రాజ్యాంగమే సుప్రీం 3
- న్యాయమూర్తులు వాస్తవాలను విస్మరించకూడదు 6
- జస్టిస్ బేలా త్రివేదికి వీడ్కోలు ఇవ్వని ఎస్సిబిఏ 8
- గృహహింస బాధితుల రక్షణకు ప్రత్యేక అధికారుల 15
- యుక్త వయసు రాక ముందే లైంగిక వేధింపులు 17
- అంతర్జాతీయ బుకర్ ప్రైజ్  విజేత బాను ముస్తాక్ 19
- విదేశీ లాయర్లపై కఠిన ఆంక్షలు 26
- ఆన్‌లైన్ గేమ్స్ నియంత్రణ చట్టం సబబే 32
- తెలంగాణలో మహిళా ఫైర్‌ఫైటర్ల నియామకానికి కసరత్తు 37
- బాలలు, మానవ హక్కులు 58
- మహిళా సంఘాలకు డిజిటల్ శక్తి 66



**UDBHAVA**
Edited, Printed, Published and Owned by **Dr. M. Madhava Vasu**
Published at 1-24-21/4, (24-387), Plot No.1, Sri Sai Nagar, Lothukunta, Alwal, Secunderabad - 500 015, Telangana, India. Phone: 040-27960130 - Mobile : +91 9848861801
email: madhavvasumanchiraju@gmail.com


**UDBHAVA**
Carries proudly the messages of society of all sections of people, especially women and children, downtrodden section of peoples rights and deprivation of any Human Rights to any section of people.


**DISCLAIMER**
The views, opinions and expressions in various ariticles, NGO and are those of Authors, Human Rights Watch, different news papers and PTI are their respective views and stature of UDBHAVA holds no responsibility.



**ACKNOWLEDGEMENT OF THE SOURCE**
The National Human Rights Commission news letters, State Human Rights Commission Reports, Mahila Commission reports, Articles of the News Papers, PTI reports, Monthly Magazines, Books and International Human Rights Watch, Andhra Pradesh and Telangana State Governments Schemes for Women and Children.

సంపాదకీయం

# గృహహింస బాధితులకు 'ప్రత్యేక' రక్షణ

గృహహింసను నిరోధించడానికి, బాధితులకు రక్షణ కల్పించేందుకు, చట్టంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడానికి ప్రత్యేక అధికారులను ఆరు వారాల్లోగా నియమించాలంటూ సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పు బాధితులకు ఉపశమనం కలిగిస్తుందనటంలో సందేహం లేదు. బాధితులకు న్యాయ సహాయంతో పాటు వారికి అవసరమైన రక్షణను ఎప్పటికప్పుడు సమీక్షించే నిమిత్తం ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ ఎంతో దోహదపడుతుంది. గృహహింస నిరోధక చట్టం నిబంధనలు సక్రమంగా అమలయ్యేలా తగిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రత్యేక అధికారులదే. జిల్లా, తాలూకా స్థాయిలో పనిచేస్తున్న అధికారుల్లో కొందరిని ఎంపిక చేసి ఈ బాధ్యతలను అప్పగించాలని దేశంలోని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను సుప్రీంకోర్టు ధర్మాసనం తన తీర్పులో విస్పష్టంగా పేర్కొంది. గృహహింస చట్టం నుంచి మహిళలకు సంక్రమించే రక్షణపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత కూడా అధికారులదే. ఇందుకు సంబంధించి పోలీసులు, ఇతర అధికారులకు తరచుగా శిక్షణనిచ్చే కార్యక్రమాన్ని ప్రభుత్వాలు చేపట్టాలని, ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించాలని కూడా తీర్పులో స్పష్టంగా పేర్కొంది. బాధిత మహిళలకు న్యాయ సహాయాన్ని అందించటానికి జాతీయ న్యాయ సేవల అథారిటీ కూడా తగు చర్యలు చేపట్టాలని సూచించింది. బాధిత మహిళలు తలదాచుకునేందుకు షెల్టర్‌హోంలు, నారీనికేతన్ వంటి గృహ కేంద్రాలను పది వారాల్లోగా ఏర్పాటుచేసి, వాటి వివరాలను బహిరంగంగా ప్రకటించాలని తీర్పులో పేర్కొంది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వాలు తుచ తప్పకుండా అమలుచేయగలిగితే బాధితులకు కొంతవరకు న్యాయం జరిగినట్టే. అయితే సమర్థవంతమైన అధికారులను నియమించకుండా నామమాత్రపు చర్యలు తీసుకుంటే సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విలువ లేనట్టే. పాలకులు, అధికారులు చిత్తశుద్ధితో దృష్టిపెడితే గృహహింస నిరోధక చట్టం అమలు దుస్సాధ్యమేమీ కాదు. చట్టంపై అవగాహన పెరిగితే మనోధైర్యం పెరుగుతుంది. హింసను భరించలేక బయటకొచ్చినా తన కాళ్లపై తాను నిలబడగలననే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. సుప్రీంకోర్టు తీర్పు గృహహింస బాధితులకు రక్షణ ఛత్రమనే చెప్పాలి.




# రాజ్యాంగమే సుప్రీం

## శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలు
## పరస్పరం గౌరవించుకోవాలి
## ఈ వ్యవస్థల్లో ఏదీ ఎక్కువా కాదు.. తక్కువా కాదు
## ప్రజాస్వామ్యంలో 3 స్తంభాలూ సమానమే
## సుప్రీంకోర్టు సీజేఐ జస్టిస్ గవాయ్

దేశంలో ఏ వ్యవస్థా గొప్పది కాదని.. భారత రాజ్యాంగం మాత్రమే సర్వోన్నతమైనదని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బీఆర్ గవాయ్ స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో కీలక స్తంభాలు.. శాసన, కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థలు మూడూ సమానమేనని అన్నారు. ఇవి ఇచ్చిపుచ్చుకునే ధోరణితో వ్యవహరించాలని.. పరస్పరం గౌరవించుకోవాలని స్పష్టంచేశారు. న్యాయవ్యవస్థ తన పరిధిని అతిక్రమిస్తోందని పెద్దఎత్తున చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. ఈ నెల 14న 52వ సుప్రీంకోర్టు చీఫ్ జస్టిసగా ప్రమాణం చేసి తొలిసారి ముంబై వచ్చిన ఆయన్ను మహారాష్ట్ర-గోవా బార్ కౌన్సిల్ సత్కరించింది. రాష్ట్ర న్యాయవాదుల సదస్సు కూడా



నిర్వహించింది. ఈ సందర్భంగా జస్టిస్ గవాయ్ ప్రసంగించారు. చట్టం చేసే అధికారం పార్లమెంటుకు ఉన్నప్పటికీ.. రాజ్యాంగ మౌలిక స్వరూపం జోలికి అది వెళ్లడానికి వీల్లేదన్నారు. 'రాజ్యాంగం సర్వోన్నత అధికారం, చట్టపాలన, న్యాయవ్యవస్థకున్న స్వేచ్ఛ వంటివాటిని రాజ్యాంగ సవరణ ద్వారా పార్లమెంటు సవరించడం గానీ, రద్దు చేయడం గానీ చేయజాలదు. రాజ్యాంగ మౌలిక నిర్మాణం దృఢతరమైనది. దాని మూలస్తంభాలైన శాసన, కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థలు మూడూ సమానమే. కలిసిమెలిసి పనిచేయాలి' అని తెలిపారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తిచేసుకుంటున్న సమయంలో ప్రధాన న్యాయమూర్తిని కావడం సంతోషకరమని తెలిపారు. 'రాజ్యాంగంలోని మూడు స్తంభాలూ తమ తమ పరిధులకు లోబడి పనిచేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. శాసన, న్యాయ్యవ్యవస్థలు చేసిన పలు చట్టాల కారణంగానే సామాజిక-ఆర్థిక న్యాయం భావన నెరవేరుతుంది' అని ఆకాంక్షించారు. ఆయన ఇచ్చిన 50 కీలక తీర్పుల సంకలనాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు. వాటిలో కొన్నిటిని జస్టిస్ గవాయ్ ప్రస్తావించారు. బుల్డోజర్ న్యాయానికి వ్యతిరేకంగా తానిచ్చిన తీర్పు గురించి వివరించారు. 'నివాస హక్కు ప్రాథమిక హక్కు. ఏ వ్యక్తి అయినా ఏదైనా కేసులో నిందితుడైనా.. దోషిగా నిర్ధారణ అయినా.. అతడి కుటుంబ నివాసం చట్టబద్ధమైనదైతే.. దానిని తొలగించడానికి, కూల్చడానికి వీల్లేదు. చట్ట పాలనను అనుసరించి వ్యవహరించాల్సిందే' అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఓకా, జస్టిస్ దత్తా, బోంబే హైకోర్టు సీజే జస్టిస్ అలోక్ అరాధే తదితరులు పాల్గొన్నారు.

మహారాష్ట్ర సీఎస్, డీజీపీల ప్రోటోకాల్ ఉల్లంఘనపై జస్టిస్ గవాయ్ ఆర్టికల్ 142ను ప్రస్తావించడం చర్చనీయాంశమైంది. చట్టసభలు పంపిన బిల్లులను గవర్నర్లు, రాష్ట్రపతి నిర్దిష్ట కాలపరిమితికి లోబడి ఆమోదించాల్సిందేనని 142వ అధికరణ కింద తనకు సంక్రమించిన అధికారాన్ని వినియోగించి సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం ఇటీవల చరిత్రాత్మక తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. దీన్ని ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ తీవ్రంగా విమర్శించారు. ఇంకోవైపు.. రాష్ట్రపతిని సైతం నిర్దేశించే అధికారం సర్వోన్నత

న్యాయస్థానానికి ఉందా.. రాష్ట్రపతి గానీ, గవర్నర్ గానీ తమ విధుల నిర్వహణలో ఏ కోర్టుకూ జవాబుదారీ కాదని రాజ్యాంగంలోని 361వ అధికరణ చెబుతోందని.. 201వ అధికరణ కింద విచక్షణాధికారాలు ఉన్న రాష్ట్రపతికి న్యాయస్థానాలు గడువు నిర్దేశించవచ్చా.. తదితర 14 ప్రశ్నలు సంధిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఇటీవల సుప్రీంకోర్టును వివరణ కోరారు. ఇది కోర్టును ధిక్కరించడమేనంటూ విపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో జస్టిస్ గవాయ్ 142 అధికరణపై చేసిన వ్యాఖ్య చర్చనీయాంశమైంది.

# సీఎస్, డీజీపీ డుమ్మా..

## ప్రొటోకాల్ ఉల్లంఘనపై సీజేఐ ఆగ్రహం

సీజేఐ సన్మాన కార్యక్రమానికి మహారాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గానీ, డీజీపీ గానీ, ముంబై పోలీసు కమిషనర్ గానీ హాజరు కాలేదు. దీనిపై సదస్సులో జస్టిస్ గవాయ్ తీవ్రంగా స్పందించారు. 'ఒక మహారాష్ట్రీయుడు భారత ప్రధాన న్యాయమూర్తి బాధ్యతలు చేపట్టి.. తొలిసారి స్వరాష్ట్రానికి వస్తే.. హాజరు కావడం సముచితమని మహారాష్ట్ర సీఎస్, డీజీపీ, ముంబై కమిషనర్‌కు అనిపించలేదంటే.. ఇది కరెక్టో కాదో వారే ఆలోచించుకోవాలి. న్యాయవ్యవస్థను ఇతర వ్యవస్థలు గౌరవించడానికి సంబంధించిన అంశమిది. ప్రొటోకాల్‌కు కట్టుబడి ఉండాలని నేను పట్టుబట్టడం లేదు. అయితే ఓ వ్యవస్థ లేదా విభాగాధిపతి.. తొలిసారి రాష్ట్రానికి వస్తే.. అందునా ఆయన అదే రాష్ట్రానికి చెందినవారైతే.. ఇలా వ్యవహరించడం సముచితమో కాదో వారు ఆలోచించుకోవాలి. ఇలాంటి చిన్న చిన్న విషయాల జోలికి నేను వెళ్లను. అయితే ప్రజలందరికీ తెలియాల్సిన అవసరం ఉందనే దీనిని ప్రస్తావించాను. అదే మా న్యాయమూర్తుల్లో ఎవరైనా ప్రొటోకాల్ ఉల్లంఘిస్తే.. సుప్రీంకోర్టుకు ప్రత్యేక అధికారాలిచ్చే 142వ అధికరణపై చర్చలు పెట్టేస్తారు' అని గవాయ్ ఆక్షేపించారు. వ్యక్తులు తప్పనిసరిగా తన ముందు హాజరవ్వాలని ఆదేశాలిచ్చే అధికారాన్ని సుప్రీంకోర్టుకు ఈ అధికరణ ఇచ్చింది.

బార్‌కౌన్సిల్ సన్మానం తర్వాత బాబాసాహెబ్ అంబేడ్కర్ స్మారక చిహ్నమైన చైత్యభూమిని సీజేఐ సందర్శించారు. అప్పటికే ఆయన చేసిన వ్యాఖ్యలు తెలియడంతో మహారాష్ట్ర సీఎస్ సుజాతా సౌనిక్, డీజీపీ రష్మీ శుక్లా, ముంబై పోలీసు కమిషనర్ దేవేన్ భారతి హడావుడిగా అక్కడకు చేరుకున్నారు.

# న్యాయమూర్తులు వాస్తవాలను విస్మరించకూడదు

## సుప్రీంకోర్ట్ చీఫ్ జస్టిస్ గవాయ్

న్యాయమూర్తులు సామాజిక వాస్తవాలను ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించకూడదని సుప్రీంకోర్ట్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ అన్నారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) సత్కార కార్యక్రమంలో మాట్లాడిన ఆయన, సామాజిక వాస్తవాలను అర్థం చేసుకోవడంలో, వాటికి ప్రతిస్పందించడంలో న్యాయమూర్తుల కీలకపాత్రను నొక్కి చెప్పారు. ఇటీవలే 52వ చీఫ్ జస్టిస్‌గా బాధ్యతలు చేపట్టిన బీఆర్ గవాయ్‌ను బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) సత్కరించింది. ఈ సందర్భంగా జస్టిస్ గవాయ్ మాట్లాడుతూ, 'మానవ అనుభవాల సంక్లిష్టతను విస్మరిస్తూ, నేటి న్యాయవ్యవస్థ చట్టపరమైన విషయాలను కఠినమైన నలుపు-తెలుపు పదాలతో చూడకూడదని' చెప్పారు. "న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టడానికి మొదట్లో నేను చాలా సంకోచించాను. కానీ మా నాన్న ఓ విషయం చెప్పారు. 'న్యాయవాదిగా ఉండడం వల్ల బాగా డబ్బులు వస్తాయి. కానీ న్యాయమూర్తిగా పనిచేయడం వల్ల సామాజిక, ఆర్థిక న్యాయం పట్ల డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కున్న



"న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టడానికి మొదట్లో నేను చాలా సంకోచించాను. కానీ మా నాన్న ఓ విషయం చెప్పారు. 'న్యాయవాదిగా ఉండడం వల్ల బాగా డబ్బులు వస్తాయి. కానీ న్యాయమూర్తిగా పనిచేయడం వల్ల సామాజిక, ఆర్థిక న్యాయం పట్ల డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కున్న దార్శనికతను ముందుకు తీసుకెళ్లడానికి వీలు కలుగుతుందని' మా తండ్రి నొక్కి చెప్పారు. అందుకే మా నాన్న సలహాకు కట్టుబడి ఉండాలని నిర్ణయించుకున్నాను"

**– సీజేఐ బీఆర్ గవాయ్**

దార్శనికతను ముందుకు తీసుకెళ్లడానికి వీలు కలుగుతుందని' మా తండ్రి నొక్కి చెప్పారు. అందుకే మా నాన్న సలహాకు కట్టుబడి ఉండాలని నిర్ణయించుకున్నాను" అని జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు.

## సుదీర్ఘ అనుభవం

జస్టిస్ బీఆర్ గవాయ్ హైకోర్టు న్యాయమూర్తిగా 22 సంవత్సరాలు, సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా 6 సంవత్సరాలు పనిచేశారు. న్యాయవ్యవస్థలో ఉన్నవారు ఒంటరిగా ఉండాలని, ప్రజలతో సంబంధాలు పెట్టుకోకూడదు అనే భావాలను చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ తోసిపుచ్చారు. న్యాయమూర్తులు అందరితో కలిసి ఉండాలని చెప్పారు.

## మహిళలకు ప్రాధాన్యం

న్యాయ నియామకాల్లో మహిళలకు, అణగారిన వర్గాలకు ప్రాతినిధ్యం పెరగాలని జస్టిస్ గవాయ్ అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్, వివిధ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు హాజరైన ఓ ముఖ్యమైన సమావేశాన్ని జస్టిస్ గవాయ్ గుర్తు చేసుకున్నారు. ఆ సమావేశంలో ఇప్పటి వరకు న్యాయవ్యవస్థలో ప్రాతినిధ్యం లేని, తక్కువ ప్రాతినిధ్యం ఉన్న వర్గాలకు చెందిన అభ్యర్థులకు సరైన అవకాశం కల్పించాలని జస్టిస్ చంద్రచూడ్ కోరారు. అత్యంత నైపుణ్యం ఉన్న మహిళా న్యాయవాదులను కచ్చితంగా గుర్తించి, ప్రోత్సహించాలని చీఫ్ జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు. ఈ ప్రయత్నం కచ్చితంగా విజయవంతం అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. న్యాయవ్యవస్థలోని ఖాళీల భర్తీ సమస్యను కూడా జస్టిస్ గవాయ్ ప్రస్తావించారు. సరిపడ న్యాయమూర్తులు లేకపోవడం వల్ల పెండింగ్ కేసులు విపరీతంగా పెరిగిపోతున్నాయని ఆయన అన్నారు. కనుక నియామకాలను వేగంవంతం చేయడంలో సహకార విధానాన్ని అవలంబించాలని ప్రభుత్వాన్ని కోరారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ కర్ణాటకలోని అత్యంత వెనుకబడిన, అణగారిన సమాజానికి చెందినవారు.

> *అత్యంత నైపుణ్యం ఉన్న మహిళా న్యాయవాదులను కచ్చితంగా గుర్తించి, ప్రోత్సహించాలి. ఈ ప్రయత్నం కచ్చితంగా విజయవంతం అవుతుందనే ఆశ వుంది. సరిపడ న్యాయమూర్తులు లేకపోవడం వల్ల పెండింగ్ కేసులు విపరీతంగా పెరిగిపోతున్నాయి. కనుక నియామకాలను వేగంవంతం చేయడంలో సహకార విధానాన్ని అవలంబించాల్సిన అవసరం ఉంది.*
>
> **– సీజేఐ గవాయ్**

# జస్టిస్ బేలా త్రివేదికి వీడ్కోలు ఇవ్వని ఎస్‌సిబిఏ

ఎస్‌సీబీఏ వైఖరిని తీవ్రంగా ఖండించిన సీజేఐ గవాయ్

జస్టిస్ త్రివేది నిజాయతీ, కఠోర శ్రమను కొనియాడిన సీజేఐ

సంప్రదాయాలను కొనసాగించాలని సూచించిన జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసిహ్

తన అంతరాత్మ ప్రకారమే ఎప్పుడూ పనిచేశానని జస్టిస్ త్రివేది స్పష్టీకరణ



సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బేలా ఎం. త్రివేదికి వీడ్కోలు పలికేందుకు సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ (ఎస్‌సీబీఏ) నిరాకరించడంపై భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బి.ఆర్. గవాయ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జస్టిస్ బేలా త్రివేది గౌరవార్థం ఏర్పాటు చేసిన సెరిమోనియల్ బెంచ్‌కు అధ్యక్షత వహించిన సీజేఐ, ఈ సందర్భంగా మాట్లాడుతూ బార్ అసోసియేషన్ వైఖరిని బహిరంగంగా తప్పుపట్టారు. జస్టిస్ త్రివేది అధికారిక పదవీ విరమణ తేదీ జూన్ 9 అయినప్పటికీ, ఆమె శుక్రవారాన్నే తన చివరి పనిదినంగా ఎంచుకున్నారు. సీజేఐ గవాయ్ మాట్లాడుతూ, “నేను సూటిగా అడుగుతున్నాను... అసోసియేషన్ ఇలాంటి వైఖరి తీసుకొని ఉండాల్సింది కాదు” అని స్పష్టం చేశారు. అయితే, ఈ కార్యక్రమానికి ఎస్‌సీబీఏ అధ్యక్షుడు కపిల్ సిబల్, ఉపాధ్యక్షురాలు రచనా శ్రీవాస్తవ హాజరుకావడాన్ని సీజేఐ ప్రశంసించారు. “కపిల్ సిబల్ గారు, రచనా శ్రీవాస్తవ గారు ఇక్కడ ఉన్నందుకు నేను కృతజ్ఞుడను. వారి సంస్థ తీర్మానం ఉన్నప్పటికీ వారు ఇక్కడ ఉన్నారు. కానీ అసోసియేషన్ ఏం కోల్పోయిందో ఇక్కడ పూర్తి సభ హాజరు రుజువు చేస్తోంది. ఆమె చాలా

మంచి న్యాయమూర్తి. వివిధ రకాల న్యాయమూర్తులు ఉంటారు, కానీ కొందరికి ఇవ్వాల్సిన గౌరవాన్ని నిరాకరించడానికి ఒక కారణంగా ఉండకూడదు" అని సీజేఐ వ్యాఖ్యానించారు. జస్టిస్ త్రివేది నిజాయతీ, నిష్పాక్షికత, కఠోర శ్రమను సుప్రీంకోర్టు సమర్థిస్తుందని సీజేఐ గవాయ్ అన్నారు. "ఆమె ఎప్పుడూ నిష్పక్షపాతంగా వ్యవహరించారు, ఆమె కఠోర శ్రమ, నిజాయతీకి ప్రసిద్ధి చెందారు... జస్టిస్ త్రివేది, మీరు మా న్యాయవ్యవస్థకు విలువైన ఆస్తి. మీరు కొత్త ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నందున, మీకు అన్ని శుభాకాంక్షలు" అని తెలిపారు. సెరిమోనియల్ బెంచ్‌లో ఉన్న మరో న్యాయమూర్తి జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్ కూడా సీజేఐ అభిప్రాయంతో ఏకీభవిస్తూ, "సంప్రదాయాలను పాటించాలి. మంచి సంప్రదాయాలు ఎల్లప్పుడూ కొనసాగుతాయని నేను నమ్ముతున్నాను" అని అన్నారు. సహాయం మంజూరు చేయడంలో కఠినంగా, సంప్రదాయ బద్ధంగా వ్యవహరిస్తారనే పేరున్న జస్టిస్ త్రివేదికి గతంలో బార్ సభ్యులతో కొన్ని సందర్భాల్లో ఘర్షణ వాతావరణం ఏర్పడినట్లు సమాచారం. నకిలీ వకాలత్‌నామా ఆధారంగా నకిలీ ఎస్‌ఎల్‌పీ దాఖలు చేశారన్న ఆరోపణలపై కొందరు న్యాయవాదులపై ఆమె నేతృత్వంలోని ధర్మాసనం సీబీఐ విచారణకు ఆదేశించింది. ఇటీవల, ఒక పిటిషన్ దాఖలు చేయడంలో కొందరు న్యాయవాదుల దుష్ప్రవర్తనపై కఠిన చర్యలు తీసుకోవాలని జస్టిస్ త్రివేది పిలుపునిచ్చారు. అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి మాట్లాడుతూ, జస్టిస్ త్రివేది ఎల్లప్పుడూ సంస్థాగత సమగ్రతను సమర్థించారని, ఈడబ్ల్యూఎస్ కేసులో కుల ఆధారిత రిజర్వేషన్ విధానాన్ని పునఃపరిశీలించాలని ఆమె వ్యక్తం చేసిన అభిప్రాయాలు సమానత్వ సమాజ సృష్టికి దోహదపడతాయని అన్నారు. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ,

> జస్టిస్ బేలా త్రివేది చాలా మంచి న్యాయమూర్తి. వివిధ రకాల న్యాయమూర్తులు ఉంటారు, కానీ కొందరికి ఇవ్వాల్సిన గౌరవాన్ని నిరాకరించడానికి ఒక కారణంగా ఉండకూడదు. నేను సూటిగా అడుగుతున్నాను... అసోసియేషన్ ఇలాంటి వైఖరి తీసుకొని ఉండాల్సింది కాదు. సంప్రదాయాలను పాటించాలి. జస్టిస్ త్రివేది నిజాయతీ, నిష్పాక్షికత, కఠోర శ్రమను సుప్రీంకోర్టు సమర్థిస్తుంది. ఆమె ఎప్పుడూ నిష్పక్షపాతంగా వ్యవహరించారు, ఆమె కఠోర శ్రమ, నిజాయతీకి ప్రసిద్ధి చెందారు... ఆమె మా న్యాయవ్యవస్థకు విలువైన ఆస్తి. కొత్త ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నందున, బేలా త్రివేదికి శుభాకాంక్షలు.
>
> **– సీజేఐ బీఆర్ గవాయ్**

జస్టిస్ త్రివేది ఎప్పుడూ ప్రజాదరణకు అనుగుణంగా ఉపశమనాన్ని మార్చలేదని, ప్రజలను అసంతృప్తి పరిచే ధైర్యం, నమ్మకం ఆమెకు ఉన్నాయని కొనియాడారు. ఎస్సీబీఏ అధ్యక్షుడు కపిల్ సిబల్ కూడా ఇదే విధమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తన ధన్యవాద ప్రసంగంలో జస్టిస్ త్రివేది కృతజ్ఞతలు తెలుపుతూ, తాను ఎల్లప్పుడూ తన అంతరాత్మ ప్రకారమే వ్యవహరించానని సంతృప్తి వ్యక్తం చేశారు. "న్యాయమూర్తులు వేర్వేరు నేపథ్యాల నుంచి సుప్రీంకోర్టుకు వస్తారు, వారి స్వంత న్యాయ భావనలను కలిగి ఉంటారు. సుప్రీంకోర్టు యొక్క ఈ బహుళత్వం ఒక బలంగా పరిగణించబడుతుంది, ఇది ప్రజాస్వామ్య విలువలు, న్యాయమూర్తుల స్వాతంత్ర్యాన్ని సూచిస్తుంది. ఏదేమైనా, సంస్థాగత ఐక్యత మరింత ముఖ్యం" అని ఆమె అన్నారు. జస్టిస్ బేలా ఎం త్రివేది 2021 ఆగస్టు 31న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఆ సమయంలో ముగ్గురు మహిళా న్యాయమూర్తులతో సహా రికార్డు స్థాయిలో తొమ్మిది మంది కొత్త న్యాయమూర్తులు ప్రమాణ స్వీకారం చేశారు. 1960 జూన్ 10న గుజరాత్‌లోని పటాన్‌లో జన్మించిన జస్టిస్ త్రివేది, సుప్రీంకోర్టు నియామకానికి ముందు గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తిగా, గుజరాత్ ప్రభుత్వంలో న్యాయ కార్యదర్శిగా, హైకోర్టులో రిజిస్ట్రార్ (విజిలెన్స్)గా వివిధ హోదాల్లో పనిచేశారు. అంతకుముందు ఆమె అహ్మదాబాద్‌లోని సిటీ సివిల్ అండ్ సెషన్స్ కోర్టులో న్యాయమూర్తిగా నియమితులయ్యారు. సుమారు 10 సంవత్సరాల పాటు గుజరాత్ హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు.





# రిటైర్మెంట్ తర్వాత ఏ పదవీ తీసుకోను

## న్యాయరంగానికి సేవలు కొనసాగిస్తా.. పదవీకాలం చివరిరోజున సీజేఐ సంజీవ్‌ఖన్నా స్పష్టీకరణ

పదవీ విరమణ అనంతరం ఏ అధికారిక పదవినీ చేపట్టబోనని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) సంజీవ్‌ఖన్నా స్పష్టం చేశారు. సీజేఐగా తన పదవీకాలం చివరిరోజైన విధుల అనంతరం సుప్రీంకోర్టు ఆవరణలో జస్టిస్ ఖన్నా విలేకర్లతో మాట్లాడారు. రిటైర్మెంట్ అనంతరం అధికారిక పదవులను వేటినీ తీసుకోనప్పటికీ, న్యాయరంగానికి సంబంధించి సేవలను మాత్రం తప్పకుండా కొనసాగిస్తానని స్పష్టం చేశారు. అంతకుముందు జస్టిస్ గవాయ్, జస్టిస్ సంజయ్‌కుమార్‌లతో కలిసి ధర్మాసనంలో జస్టిస్ ఖన్నా విధులు నిర్వర్తించారు. అనంతరం, సుప్రీంకోర్టు బార్

అసోసియేషన్ తనకు నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ ఖన్నా మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు విలువలను, రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులను, మౌలిక రాజ్యాంగ నిబంధనలను కొత్త ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ గవాయ్ కచ్చితంగా నిలబెడతారని తాను నమ్ముతున్నానన్నారు. 'జస్టిస్ గవాయ్, నేను సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఒకే ఏడాది పదోన్నతి పొందాం. ప్రస్తుతం కొలీజియంలో ఉన్నాం. పలు సందర్భాల్లో మేం పరస్పరం చర్చించుకున్నాం. జస్టిస్ గవాయ్ నాకు అత్యంత బలమైన మద్దతుదారుగా నిలిచారు' అని వెల్లడించారు.

న్యాయమూర్తిగా తనకు ఎన్నో మధుర జ్ఞాపకాలున్నాయని, వాటిని జీవితాంతం గుర్తుంచుకుంటానన్నారు. న్యాయవ్యవస్థ అంటే న్యాయమూర్తులు మాత్రమే కాదని, బార్ (న్యాయవాదులు) కూడా దాంట్లో భాగమని, ప్రజల్లో న్యాయవ్యవస్థ పట్ల నమ్మకాన్ని పెంచేలా చేయటంలో న్యాయవాదుల పాత్రకూడా కీలకమని తెలిపారు. విభిన్న ప్రాంతాలకు చెందిన న్యాయమూర్తులు సుప్రీంకోర్టులో ఉండటంపై జస్టిస్ ఖన్నా హర్షం వ్యక్తం చేశారు. 'దేశంలోని వేర్వేరు ప్రాంతాలకు చెందిన జడ్జిలు ఉండటం వల్ల సుప్రీంకోర్టుకు ఎనలేని బలం చేకూరింది. వేర్వేరు నేపథ్యాలు, వేర్వేరు ఆలోచనా ధోరణులు గల న్యాయమూర్తుల మధ్య జరిగిన చర్చలు పలు రకాల పరిష్కారాలను, సరైన మార్గాన్ని చూపాయి' అని ఆయన వెల్లడించారు.

జస్టిస్ గవాయ్ మాట్లాడుతూ, '1976 నాటి ఏడీఎం జబల్‌పూర్ కేసులో జస్టిస్ హెచ్‌ఆర్ ఖన్నా ఒక్కరే మైనారిటీ తీర్పునిచ్చారు. నాటి ఎమర్జెన్సీ సమయంలో రాజ్యాంగ హక్కుల కోసం నిలబడ్డారు. ఆయన సోదరుడి కుమారుడైన జస్టిస్ సంజీవ్‌ఖన్నా.. తన పెద్దనాన్న వారసత్వాన్ని నిలబెట్టటమే కాదు, న్యాయవ్యవస్థ మీద తనదైన సొంత ముద్ర వేశారు' అని శ్లాఘించారు. జస్టిస్ ఖన్నాలో ఉండే స్పష్టత, నైతికనిష్ఠ, ఆయన ఇచ్చిన తీర్పులు రాజ్యాంగ విలువలకు అద్దం పడుతాయన్నారు. సుప్రీంకోర్టు ప్రతిష్ఠను జస్టిస్ ఖన్నా మరింత పెంచారని సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ పేర్కొన్నారు.

'న్యాయం పట్ల మీకున్న అంకితభావం, మీరు చూపిన పారదర్శకత, యువ న్యాయవాదులకు ఇచ్చిన ప్రోత్సాహం ఎప్పటికీ మర్చిపోలేనివి. కొత్తతరాలకు మీరొక ప్రమాణాన్ని నిర్దేశించారు. నాడు జస్టిస్ హెచ్‌ఆర్ ఖన్నా ఇచ్చిన మైనారిటీ తీర్పే నేడు అంతటా ప్రతిధ్వనిస్తోంది. మెజారిటీ తీర్పును అందరూ మర్చిపోయారు. జస్టిస్ హెచ్‌ఆర్ ఖన్నా సృష్టించిన ఆ జ్వాలను మీరు ముందుకు తీసుకెళ్లారు' అంటూ జస్టిస్ సంజీవ్‌ఖన్నా సేవలను కపిల్ సిబల్ కొనియాడారు.



# పదవీ విరమణ రోజు తల్లి మరణం..

# అయినా 11 తీర్పులిచ్చిన సుప్రీం జడ్జి ఓకా

సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఎఎస్ ఓకా చరిత్రనే మార్చారు. తన పదవీ విరమణ రోజు సాంప్రదాయాల్ని పక్కనపెట్టి పనే పరమావధి అని చేసి చూపించారు. ఎంతో ప్రేమ ఉన్న తన తల్లిని కోల్పోయి ఒక్క రోజు కూడా గడవగముందే కోర్టుకు హాజరయ్యారు. అంతేకాదు, ఏకంగా చివరి రోజున 11 తీర్పులు ఇచ్చారు. "పదవీ విరమణ" అనే పదాన్ని తాను ద్వేషిస్తానని, చివరి రోజున పని చేయకపోవడం అనే సంప్రదాయంతో తాను ఏకీభవించనని ఓకా చెప్పారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఓకా మే 24న పదవీ విరమణ చేయబోతున్నారని బార్ అండ్ బెంచ్ ప్రకటించింది. దీనికి ముందు రోజు ముందు ఓకా తన తల్లి చనిపోవడంతో అంత్యక్రియలకు హాజరు కావడానికి ముంబైకి బయలుదేరి వెళ్లారు. ఒక్క రోజులోనే ఢిల్లీకి తిరిగివచ్చి కోర్టుకు హాజరయ్యారు. పదవీ విరమణ రోజున పని చేయకూడదనే సంప్రదాయాన్ని పక్కనపెట్టి జస్టిస్ ఓకా తన సాధారణ బెంచ్‌లో భాగంగా 11 తీర్పులు వెలువరించారు. తర్వాత చీఫ్ జస్టిస్ బిఆర్ గవైతో కలిసి ఉత్సవ బెంచ్‌కి వెళ్లారు. కాగా, ఈ వారం ప్రారంభంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి అయిన ఓకాకు సుప్రీంకోర్టు అడ్వకేట్స్ ఆన్ రికార్డ్ అసోసియేషన్ అభినందన సభ ఏర్పాటు చేసింది.

ఆ సభలో జస్టిస్ ఓకా మాట్లాడుతూ చివరి రోజున పని చేయకూడదనే సంప్రదాయంతో తాను ఏకీభవించనని సభా ముఖంగా ప్రకటించారు. "పదవీ విరమణ చేసే న్యాయమూర్తి చివరి రోజున పని చేయకూడదనే సుప్రీంకోర్టులో అనుసరించే ఒక సంప్రదాయాన్ని నేను ఆమోదించను. ఆ సంప్రదాయాన్ని వదిలించుకోవడానికి మనకు కొంత సమయం పడుతుంది, కానీ కనీసం చివరి రోజున నేను రెగ్యులర్ బెంచ్‌లో కూర్చుని కొన్ని తీర్పులు ప్రకటించడంలో నాకు సంతృప్తి ఉంది" అని ఆయన చెప్పారు. "పదవీ విరమణ" అనే పదాన్ని తాను ద్వేషిస్తున్నానని, జనవరి 2025 నుండి వీలైనన్ని ఎక్కువ కేసులు వినాలని నిర్ణయించుకున్నానని, అలాగే పనిచేశానని ఆయన అన్నారు. మే 25, 1960న జన్మించిన జస్టిస్ ఓకా, 1985లో బాంబే హైకోర్టు మాజీ న్యాయమూర్తి వీపీ టిప్నిస్ చాంబర్‌లో చేరి తన కెరీర్‌ను ప్రారంభించారు. బాంబే విశ్వవిద్యాలయంలో గ్రాడ్యుయేట్ అయిన ఆయన 2003లో బాంబే హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. తరువాత 2005లో శాశ్వత న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. బాంబే హైకోర్టులో పదవీకాలం ముగిసిన తర్వాత, జస్టిస్ ఓకా 2019లో కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2021లో సుప్రీంకోర్టుకు పదోన్నతి పొందారు.

# సుప్రీం కొలీజియం సభ్యురాలిగా జస్టిస్ నాగరత్న




సుప్రీంకోర్టు కొలీజియం సభ్యురాలిగా జస్టిస్ బి.వి.నాగరత్న నియమితులయ్యారు. ఇంతవరకు కొలీజియంలో సభ్యుడిగా ఉన్న జస్టిస్ అభయ్ ఎస్ ఓకా పదవీ విరమణ చేయడంతో సీనియార్టీలో అయిదో స్థానంలో ఉన్న జస్టిస్ నాగరత్న నియమితులయ్యారు. ప్రస్తుతం కొలీజియంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రం నాథ్, జస్టిస్ కె.జి.మహేశ్వరి, జస్టిస్ నాగరత్న సభ్యులుగా ఉన్నారు. నూతన కొలీజియం ప్రథమ సమావేశం సోమవారం జరిగే అవకాశం ఉంది. సుప్రీంకోర్టులో ఉన్న మూడు జడ్జీల పోస్టుల ఖాళీలు, వివిధ హైకోర్టుల్లోని ఖాళీలపై చర్చలు జరిపే అవకాశం ఉంది. సీనియారిటీ ప్రకారం జస్టిస్ నాగరత్న 2027 సెప్టెంబరు 23న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదోన్నతి పొందే అవకాశం ఉంది. అదే జరిగితే ఆమె భారతదేశ ప్రథమ మహిళా ప్రధాన న్యాయమూర్తి కానున్నారు. నెల రోజుల పాటు ఆ పదవిని నిర్వహించి 2027 అక్టోబరు 29న పదవీ విరమణ చేసే అవకాశం ఉంది.

### గృహహింస బాధితుల రక్షణకు

# ప్రత్యేక అధికారుల నియామకం ఆరు వారాల్లోపు పూర్తి చేయండి

## రాష్ట్రాలకు సుప్రీంకోర్టు ఆదేశం

## జిల్లా, తాలూకా స్థాయిల్లో ఏర్పాటుచేయాలని నిర్దేశం



గృహహింస బాధితులకు రక్షణ కల్పించటానికి దేశవ్యాప్తంగా ప్రత్యేక అధికారులను ఆరు వారాల్లోపు నియమించాలని రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. గృహహింస నిరోధక చట్టం నిబంధనలు సమర్థంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని పేర్కొంది. ఈ మేరకు జస్టిస్ నాగరత్న, జస్టిస్ సతీష్‌చంద్రశర్మలతో కూడిన ధర్మాసనం గత నెల 20వ తేదీన ఇచ్చిన తీర్పు తాలూకు పూర్తి వివరాలు తాజాగా వెల్లడయ్యాయి. ఈ తీర్పు కాపీని సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. తీర్పులోని ముఖ్యాంశాలు.. మహిళా, శిశు సంక్షేమశాఖలో జిల్లా, తాలూకా స్థాయిల్లో పని చేస్తున్న అధికారుల్లో కొందరిని గృహహింస బాధితుల కోసం 'రక్షణ అధికారులు'గా నియమించాలి. దీనికోసం ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలితప్రాంత ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శులు, మహిళా శిశు సంక్షేమశాఖ కార్యదర్శులు సమన్వయంతో పని చేసి నియామకాల్ని ఆరు వారాల్లోగా పూర్తి చేయాలి. రక్షణ అధికారులు గృహహింస నిరోధక చట్టంలోని సెక్షన్ 9కి అనుగుణంగా విధులను నిర్వర్తించాలి. గృహహింస నిరోధక చట్టం సెక్షన్ 11 ప్రకారం.. బాధిత మహిళలకు చట్టం కల్పించే రక్షణ గురించి ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసి అవగాహన కల్పించాలి. చట్టం గురించి పోలీసు, న్యాయవ్యవస్థలతోపాటు ఇతర శాఖల అధికారులకు కూడా

ఎప్పటికప్పుడు శిక్షణనివ్వాలి. చట్టం అమలును నిర్ణీత కాలవ్యవధుల్లో క్రమం తప్పకుండా సమీక్షించాలి. కేంద్రప్రభుత్వం కూడా కీలకపాత్ర పోషించాలి. బాధిత మహిళలకు ఉచితంగా, తక్షణ న్యాయ సహాయం అందించాలని చట్టం నిర్దేశిస్తోంది. ఈ మేరకు జాతీయ న్యాయ సేవల అథారిటీ తగు చర్యలు చేపట్టాలి. బాధిత మహిళలు తలదాచుకోవటానికి షెల్టర్‌హోం, నారీనికేతన్ వంటి గృహ కేంద్రాలను ఏర్పాటు చేయాలి. జిల్లా, తాలూకా స్థాయిల్లో వీటి వివరాలను బహిరంగంగా ప్రకటించాలి. 10 వారాల్లోపు ఇది జరగాలి.

పలు రాష్ట్రాలు, కేంద్రపాలితప్రాంతాల్లో గృహహింస నిరోధక చట్టం సరిగా అమలు కావటం లేదంటూ 'వి ద ఉమెన్' అనే స్వచ్ఛందసంస్థ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ చట్టం అమలుకు ప్రత్యేకంగా అధికారులను నియమించకుండా.. 'సమీకృత శిశు సంక్షేమ పథకం' (ఐసీడీఎస్) సిబ్బందికి, అంగన్‌వాడీ కార్యకర్తలకు అదనంగా బాధ్యతలు అప్పగిస్తున్నారని తెలిపింది. ఇది వారి పని భారాన్ని పెంచటంతో.. చట్టం అమలుపై వారు దృష్టి పెట్టలేకపోతున్నారని.. ఫలితంగా బాధిత మహిళలకు రక్షణ లేకుండా పోతుందని పేర్కొంది. ఈ నేపథ్యంలోనే, ప్రత్యేకంగా అధికారులను నియమించాలని, చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సుప్రీంకోర్టు మార్గదర్శకాలు జారీ చేసింది.



# యుక్త వయసు రాక ముందే లైంగిక వేధింపులు

## దక్షిణాసియాలో భారత్‌దే మొదటి స్థానం

## బాలికల పైనే అధికం - లాన్సెట్ జర్నల్ వెల్లడి

ప్రపంచంలో ప్రతి ఐదుగురు బాలికలలో ఒకరు, ప్రతి ఏడుగురు బాలురలో ఒకరు 18 సంవత్సరాల వయసు నిండకుండానే లైంగిక వేధింపులకు గురవుతున్నారు. 2023లో మన దేశంలో 30 శాతం మంది బాలికలు, 13 శాతం మంది బాలురు ఈ విధమైన లైంగిక వేధింపులకు గురయ్యారని లాన్సెట్ జర్నల్‌లో ప్రచురితమైన ఓ విశ్లేషణ తెలిపింది. 1990-2023 మధ్య కాలంలో 200కు పైగా దేశాలలో బాలలపై జరిగిన లైంగిక వేధింపులకు సంబంధించి ఈ అధ్యయనం అంచనాలు రూపొందించింది. బాలికలపై దక్షిణాసియాలో అధికంగా లైంగిక వేధింపులు నమోదయ్యాయని తెలిపింది. ఈ ప్రాంతానికి సంబంధించి బంగ్లాదేశ్‌లో బాలికలపై లైంగిక వేధింపులు 9.3 శాతం నమోదవగా భారత్‌లో అత్యధికంగా 30.8 శాతం రికార్డయ్యాయని వివరించింది. అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్‌కు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఫర్ హెల్త్ మెట్రిక్స్ అండ్ ఎవాల్యుయేషన్ పరిశోధకులు ఈ అధ్యయనంలో భాగస్వాములయ్యారు. 18 సంవత్సరాల కంటే తక్కువ వయసున్న బాలికలకు సంబంధించి సబ్-సహారన్ ఆఫ్రికాలో (సహారాకు దక్షిణంగా ఉన్న ఆఫ్రికా ఖండంలోని ప్రాంతాలు) లైంగిక వేధింపుల రేటు అధికంగా ఉన్నదని అధ్యయ నంలో తేలింది. ఈ ప్రాంతంలోని జింబాబ్వేలో 8 శాతం రేటు నమోదవగా పశ్చిమ ఆఫ్రికాలోని ఐవరీ కోస్ట్‌లో అత్యధికంగా 28 శాతం రికార్డయింది.

బాలలపై లైంగిక వేధింపులు అనేది తీవ్రమైన

> బాలికలపై దక్షిణాసియాలో అధికంగా లైంగిక వేధింపులు నమోదయ్యాయి. బంగ్లాదేశ్‌లో బాలికలపై లైంగిక వేధింపులు 9.3 శాతం నమోదవగా భారత్‌లో అత్యధికంగా 30.8 శాతం రికార్డయ్యాయి. అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్‌కు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఫర్ హెల్త్ మెట్రిక్స్ అండ్ ఎవాల్యుయేషన్ పరిశోధకులు ఈ అధ్యయనంలో భాగస్వాములయ్యారు.

ప్రజారోగ్య, మానవ హక్కులకు సంబంధించిన అంశం. లైంగిక వేధింపులు జరిగినప్పుడు దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయి. వారి మానసిక ఆరోగ్య పరిస్థితి కూడా దెబ్బతింటుంది. ఇలాంటి ఘటనలు జరకుండా ఉండాలంటే లైంగిక వేధింపులకు సంబంధించిన కచ్చితమైన అంచనాలు అవసరమని అధ్యయనం అభిప్రాయపడింది. అయితే ప్రస్తుతం కొన్ని పరిమిత దేశాలలో మాత్రమే సమాచారం అందుబాటులో ఉన్నదని, దానిలో కూడా సమగ్రత లోపించిందని, అంచనాలకు రావడంలో సవాళ్లు ఎదురవుతున్నాయని తెలిపింది. లైంగిక వేధిం పులపై అంతర్జాతీయ అంచనాలు రూపొందించిన తొలి అధ్యయనం ఇదే కావడం గమనార్హం. అందుబాటులో ఉన్న డేటా ఆధారంగానే అందులో అంచనాలు వేయడం జరిగింది. ప్రపంచవ్యాప్తంగా 2023లో వయసు-చిన్నారులపై లైంగిక హింస అనేది బాలికలలో 18.9 శాతం, బాలురలో 14.8 శాతంగా ఉన్నదని తాము అంచనా వేశామని అధ్యయన రచయితలు తెలిపారు. 18 సంవత్సరాల కంటే తక్కువ వయసున్న యువతీ యువకులలో మొదటిసారి లైంగిక హింసకు గురికావడం అనేది సుమారు 70 శాతం మందిలో జరిగిందని వారు చెప్పారు. లైంగిక హింస నుండి బయటపడిన వారికి జీవితాంతం అండగా ఉండడానికి, చిన్నారులకు లైంగిక హింసకు తావు లేని బాల్యాన్ని అందించడానికి మరిన్ని సేవలు, వ్యవస్థలు అవసరమని వారు సూచించారు.



# అంతర్జాతీయ బుకర్ ప్రైజ్ విజేత బాను ముస్తాక్




భారతీయ రచయిత్రి, న్యాయవాది, ఉద్యమకారిణి బాను ముస్తాక్ రచించిన చిన్న కథల సంకలనం 'హార్ట్ ల్యాంప్' కు ఇంటర్నేషనల్ బుకర్ ప్రైజ్ లభించింది. దీంతో కన్నడ భాషలో ఈ బహుమతి గెలుచుకున్న తొలి పుస్తకంగా 'హార్ట్‌ల్యాంప్' రికార్డులకెక్కింది. కన్నడంలో ఉన్న హార్ట్‌ల్యాంప్‌లోని కథలను ఇంగ్లిష్‌లోకి దీపా భస్తి అనువదించారు. 1990 నుంచి 2023 మధ్య ముస్తాక్ రాసిన 12 చిన్నకథల ఈ పుస్తకంలో, దక్షిణ భారతదేశంలో ముస్లిం మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లు, ఇబ్బందులను వివరించారు. ముస్తాక్ అందుకున్న ఈ అవార్డుకు చాలా ప్రాధాన్యముందని, ఇది ఆమె రచనలకు పేరు తీసుకురావడమేకాక, భారతదేశ ప్రాంతీయ సాహిత్య సంప్రదాయాలను కూడా ముందుకు తెస్తుందని భావిస్తున్నారు. 2022 సంవత్సరం ప్రారంభంలో, గీతాంజలి శ్రీ రాసిన 'టూంబ్ ఆఫ్ శాండ్' పుస్తకం కూడా ఇంటర్నేషనల్ బుకర్ ప్రైజ్ అవార్డును అందుకుంది. 'టూంబ్ ఆఫ్ శాండ్' ను డైసీ రాక్‌వెల్ హిందీ నుంచి ఇంగ్లిష్‌లోకి అనువదించారు. మతపరమైన సంకుచిత భావాలు, పితృస్వామ్య సమాజం నుంచి...మహిళలు ఎదుర్కొనే సవాళ్లు ఆమె సాహిత్యంలో కనిపిస్తాయి. సమస్యల పట్ల అవగాహన ఉంటడంతో ఆమె కథల్లోనే పాత్రలు

> *“నేనెప్పుడూ రాయాలనే అనుకునేదాన్ని. కానీ దేనిగురించి రాయాలో తెలిసేది కాదు. తర్వాత వివాహం జరిగింది. అకస్మాత్తుగా బురఖా ధరించాల్సి వచ్చింది. జీవితాంతం ఇంటి పనులు చేయాలని చెప్పారు. 29 ఏళ్ల వయసులో తల్లినయ్యా. ప్రసవానంతర కుంగుబాటుకు గురయ్యాను. నేనెప్పుడూ మూఢనమ్మకాలు, మతపరమైన ఛాందస విధానాలనే సవాల్ చేశాను. ఈ సమస్యలు నా రచనకు కేంద్రబిందువుగా ఉన్నాయి. సమాజం చాలా మారిపోయింది, కానీ ప్రాథమిక సమస్యలు ఇప్పటికీ అలాగే ఉన్నాయి. అయినా మహిళలు, అణగారిన వర్గాల పోరాటం కొనసాగుతుంది”*

సున్నితమైన భావాలను పలికిస్తుంటాయని సాహితీ విమర్శకులు అభిప్రాయపడ్డారు.

కర్ణాటకలోని ఒక చిన్న పట్టణంలో ముస్లింలు ఎక్కువగా ఉండే ప్రాంతంలో పెరిగారు ముస్తాక్. అక్కడున్న చాలామంది అమ్మాయిల మాదిరిగానే, స్కూల్లో ఉర్దూ భాషలో ఖురాన్ చదివారు. అయితే ప్రభుత్వ ఉద్యోగి అయిన ఆమె తండ్రి, బాను ముస్తాక్‌ను మామూలు స్కూల్లో చదివించాలని కోరుకున్నారు. ఆమెకు ఎనిమిదేళ్ల వయసులో కన్నడ మీడియం కాన్వెంట్‌లో చేర్చారు. కన్నడ భాషపై పట్టు సాధించడానికి ముస్తాక్ చాలా కష్టపడ్డారు. కానీ ఆ తరువాత ఈ భాషే ఆమె సాహిత్య వ్యక్తీకరణకు తోడ్పడింది. స్కూల్ రోజుల నుంచే ఆమె రాయడం మొదలుపెట్టారు. తోటి స్నేహితులంతా పెళ్లికి మొగ్గుచూపుతున్న సమయంలో, బాను ముస్తాక్ మాత్రం ఇంకా చదువుకోవాలి, కాలేజీకి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ముస్తాక్ రచనలు పబ్లిష్ కావడానికి కొన్నేళ్ల సమయం పట్టింది. ఆ సమయంలో ఆమె చాలా ఇబ్బందికర పరిస్థితులను కూడా ఎదుర్కొన్నారు. 26 ఏళ్ల వయసులో ఆమె తాను ప్రేమించిన వ్యక్తిని పెళ్లి చేసుకున్నారు. వివాహం జరిగిన ఏడాది తర్వాత, ఆమె రాసిన చిన్న కథ స్థానిక పత్రికలో ప్రచురితమైంది. ఆమె వివాహ జీవితం మొదట్లో గొడవలతోనే గడిచినట్టుగా చాలా ఇంటర్వ్యూలలో చెప్పారామె. “నేనెప్పుడూ రాయాలనే అనుకునేదాన్ని. కానీ దేనిగురించి రాయాలో తెలిసేది కాదు. తర్వాత వివాహం జరిగింది. అకస్మాత్తుగా బురఖా ధరించాల్సి వచ్చింది. జీవితాంతం ఇంటి పనులు చేయాలని చెప్పారు. 29 ఏళ్ల వయసులో తల్లినయ్యా. పోస్ట్‌పార్టమ్ డిప్రెషన్ (ప్రసవానంతర కుంగుబాటు)కు గురయ్యా” అని వోగ్ మ్యాగజీన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె చెప్పారు. “ఒకానొక సందర్భంలో నేను పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకోవాలనుకున్నా. అదృష్టవశాత్తు నా భర్త నన్ను కాపాడారు. నా బిడ్డను నా కాళ్లమీద పెట్టి, మమ్మల్ని ఒంటరివాళ్లను చెయ్యొద్దని వేడుకున్నారు” అని ‘ది వీక్’ మ్యాగజైన్‌తో అన్నారు ముస్తాక్. హార్ట్‌ల్యాంప్‌లో ఆమె సృష్టించిన స్త్రీ పాత్రలు ప్రతిఘటన, తిరుగుబాటు తత్వాన్ని ప్రతిబింబిస్తాయి. “ప్రధాన స్రవంతి భారతీయ సాహిత్యంలో, ముస్లిం

మహిళల పాత్రలు చురుకుగా కనిపించవు. బాధలను ఓర్చుకుని అణచివేతను అనుభవించే తత్వంతో కనిపిస్తాయి. కానీ, ముస్తాక్ రచనల్లో అలా కాదు. ఆమె పాత్రలు కష్టపడే తత్వంతో, సమస్యలపై చర్చించే ధైర్యం కలిగిన పాత్రలు. కొన్నిసార్లు నిరసన కూడా తెలుపుతాయి. అది




జీవితాలను మార్చేసే నిరసన" అని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ వార్తాపత్రికలో ప్రచురితమైన ఒక రివ్యూ పేర్కొంది.

## మహిళల హక్కుల కోసం..

ముస్తాక్ ఒక ప్రముఖ స్థానిక పత్రికకు రిపోర్టర్‌గా పనిచేశారు. తరువాత 'బందాయ ఉద్యమం'లో చేరారు. సాహిత్యం, క్రియాశీలత ద్వారా సామాజిక, ఆర్థిక అన్యాయాలను రూపుమాపడానికి ఈ ఉద్యమం నిర్వహిస్తున్నారు. దశాబ్దం పాటు జర్నలిస్టుగా పనిచేసిన తర్వాత, న్యాయవాద వృత్తి చేపట్టారు. దశాబ్దాల తన కెరీర్‌లో, గణనీయమైన సంఖ్యలో ఆమె రచనలు ప్రచురితమయ్యాయి. వీటిలో ఆరు చిన్న కథా సంకలనాలు, ఒక వ్యాస సంకలనం, ఒక నవల ఉన్నాయి. కానీ ఆమె పదునైన రచనల వల్ల కొందరు ఆమెను ద్వేషించారు కూడా. మసీదులలో నమాజ్ చేసే మహిళల హక్కులకు మద్దతుగా తన అభిప్రాయాలను వ్యక్తం చేసినందుకు 2000 సంవత్సరంలో తనకు బెదిరింపు కాల్స్ వచ్చాయని 'ది హిందూ' వార్తాపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ముష్తాక్ వివరించారు. ఆమెపై ఫత్వా జారీ చేశారు. ఒక వ్యక్తి ఆమెపై కత్తితో దాడి చేయడానికి ప్రయత్నించగా, ఆమె భర్త అడ్డుకున్నారు. ఇంత జరిగినా ముస్తాక్ భయపడలేదు. రచనలు కొనసాగించారు. "నేనెప్పుడూ మూఢనమ్మకాలు, మతపరమైన ఛాందస విధానాలనే సవాల్ చేశాను. ఈ సమస్యలు నా రచనకు కేంద్రబిందువుగా ఉన్నాయి. సమాజం చాలా మారిపోయింది, కానీ ప్రాథమిక సమస్యలు ఇప్పటికీ అలాగే ఉన్నాయి. అయినా మహిళలు, అణగారిన వర్గాల పోరాటం కొనసాగుతుంది" అని ఆమె 'ది వీక్' మ్యాగజైన్‌తో అన్నారు. ముష్తాక్ రచనలు కర్ణాటక సాహిత్య అకాడమీ అవార్డుతోపాటు అనేక స్థానిక, జాతీయ అవార్డులను గెలుచుకున్నాయి. 1990-2012 మధ్య ప్రచురితమైన ఐదు చిన్న కథల సంకలనం 'హసీనా అండ్ అదర్ స్టోరీస్' కూడా 2024లో ఆంగ్లంలోకి అనువాదమై ప్రతిష్టాత్మకమైన ట్రాన్స్‌లేషన్ ప్రైజ్‌ని గెలుచుకుంది.

# కల్నల్ సోఫియాపై వ్యాఖ్యలు అభ్యంతరకరమే: ఎన్‌సీడబ్ల్యూ



ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు మీడియాకు వివరిస్తూ వచ్చిన కల్నల్ సోఫియా ఖురేషిపై అభ్యంతకర వ్యాఖ్యలను జాతీయ మహిళా కమిషన్ తీవ్రంగా ఖండించింది. సాయుధ బలగాల్లో పనిచేస్తున్న మహిళల పట్ల గౌరవప్రదంగా వ్యవహరించాలని పేర్కొంది. మధ్యప్రదేశ్ మంత్రి విజయ్ షా ఇటీవల ఒక కార్యక్రమంలో కల్నల్ సోఫియాపై చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. మంత్రి పేరును ఎన్‌సీడబ్ల్యూ నేరుగా ప్రస్తావించనప్పటికీ, బాధ్యత కలిగిన పదవుల్లో ఉన్న వ్యక్తులు మహిళలను కించపరచేలా మాట్లాడటం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని ఎన్‌సీడబ్ల్యూ చైర్‌పర్సన్ విజయ్ రహాట్కర్ అన్నారు. ఇది సమాజంలోని మహిళల గౌరవాన్ని కించపరచడమే కాకుండా, దేశ భద్రతలో కీలక భూమిక పోషిస్తున్న మన ఆడకూతుళ్లను అవమానించడమే అవుతుందన్నారు. కల్నల్ సోఫియా ధైర్యసాహసాలు, అంకితభావం కలిగిన అధికారి అని, అటువంటి మహిళలను చూసి దేశం గర్విస్తోందని పేర్కొన్నారు. మధ్యప్రదేశ్ గిరజన సంక్షేమ శాఖ మంత్రి విజయ్ షా ఇటీవల ఒక కార్యక్రమంలో కల్నల్ సోఫియాపై చేసిన వ్యాఖ్యలు వివాదమయ్యాయి. ఇందుకు సంబంధించిన వీడియోను కాంగ్రెస్ పార్టీ షేర్ చేస్తూ, మంత్రి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసింది. "వాళ్లు (ఉగ్రవాదులు) మన సోదరీమణుల నుదుట సిందూరాన్ని తుడిచేశారు. వాళ్ల (ఉగ్రవాదులు) మతానికి చెందిన సోదరిని పంపించి గట్టి గుణపాఠం చెప్పాం" అని విజయ్ షా చేసిన వ్యాఖ్యలు వివాదం రేపాయి. అయితే, ఆ తర్వాత తన వ్యాఖ్యలకు మంత్రి విజయ్ షా క్షమాపణలు తెలిపారు. తన వ్యాఖలు ఎవరినీ కించపరచేందుకు చేసినవి కావని, ఎవరినైనా నొప్పిస్తే ఒకటికి పదిసార్లు క్షమాపణ చెబుతానని అన్నారు.

# యుద్ధ బీభత్సానికి సజీవ సాక్ష్యం.. పాలస్తీనా బాలుని చిత్రం!

ఫొటో ఆఫ్ ది ఇయర్ - 2025



గాజాపై ఇజ్రాయెల్ చేసిన దాడిలో రెండు చేతులూ కోల్పోయిన పాలస్తీనా బాలుడు మహమ్మద్ అజ్జూర్ (9) చిత్రం 'వరల్డ్ ప్రెస్ ఫొటో ఆఫ్ ది ఇయర్ 2025'గా ఎంపిక అయ్యింది. ఖతర్ కేంద్రంగా పనిచేస్తున్న పాలస్తీనియాకు చెందిన మహిళా ఫొటోగ్రాఫర్ సమర్ అబు ఎలౌఫ్ 'న్యూయార్క్ టైమ్స్' కోసం ఈ ఫొటో తీశారు. "మహమ్మద్ అజ్జూర్ తల్లితో నేను మాట్లాడాను. తన రెండూ చేతులు ఇక లేవని తెలియగానే, అమ్మా! ఇకపై నేను నిన్నెలా హత్తుకోనూ?" అంటూ ఆ బాలుడు తల్లిని ప్రశ్నించాడు" అని అబూ ఎలౌఫ్ చెప్పిన మాటలను వరల్డ్ ప్రెస్ ఫొటో ఆర్గనైజేషన్ ఈ సందర్భంగా ఉటంకించింది. 68వ వేడుకగా జరిగిన ఈ ప్రతిష్ఠాత్మక ఫొటో జర్నలిజం పోటీల్లో 141 దేశాలకు చెందిన 3,778 మంది ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు. వారు ఏకంగా 59,320 ఎంట్రీలను సమర్పించారు. "ఇది ఒక బాలుడి కథను, ఆవేదనను బిగ్గరగా చెప్పే ఓ నిశ్శబ్ద ఫొటో. తరతరాలపై ప్రభావం చూపే ఓ పాశవిక, సుదీర్ఘ యుద్ధం గురించి కూడా ఇది చెబుతుంది" అని వరల్డ్ ప్రెస్ ఫొటో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జౌమానా ఎల్‌జీన్ ఖౌరీ అన్నారు.

# జాతీయ విద్యా విధానం అమలు

# ఏ రాష్ట్రాన్ని బలవంతం చేయలేం

## సుప్రీంకోర్టు స్పష్టీకరణ

## కచ్చితంగా అమలుచేయాలన్న పిటిషన్ కొట్టివేత



జాతీయ విద్యా విధానం (NEP)- 2020 అమలుచేయాలని ఏ రాష్ట్రాన్ని బలవంతం చేయలేమని సుప్రీంకోర్టు పేర్కొంది. ఎన్ఈపీని అమలు చేసేలా తమిళనాడు రాష్ట్రానికి ఆదేశాలు ఇవ్వాలంటూ జీఎస్ మణి దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యున్నత ధర్మాసనం కొట్టివేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 ప్రకారం ఏ రాష్ట్రాన్ని కూడా ఎన్ఈపీని స్వీకరించాలని సుప్రీంకోర్టు కచ్చితంగా చెపేపలేదని జస్టిస్ జె.బి.పార్దివాలా, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం వివరించింది. 'రాష్ట్రాలు జాతీయ విద్యా విధానం-2020ని స్వీకరించాలా? వద్దా? అనేది సంకటమైన సమస్య. రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 ద్వారా సుప్రీంకోర్టు పౌరుల హక్కులను పరిరక్షించడానికి ఆదేశాలు జారీ చేయవచ్చు. జాతీయ విద్యా విధానం 2020 వంటి విధానాన్ని స్వీకరించమని నేరుగా చెప్పలేదు.' అని ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే, జాతీయ విద్యా విధానానికి సంబంధించి రాష్ట్రం తీసుకునే ఏదైనా చర్య ప్రాథమిక హక్కును ఉల్లంఘిస్తే కోర్టు తప్పకుండా జోక్యం చేసుకుంటుందని వెల్లడించింది. అయితే, జాతీయ విద్యా విధానానికి సంబంధించి రాష్ట్రం తీసుకునే ఏదైనా చర్య ప్రాథమిక హక్కును ఉల్లంఘిస్తే కోర్టు తప్పకుండా జోక్యం చేసుకుంటుందని వెల్లడించింది. ఈ సందర్భంగా పిటిషనర్‌ను ఉద్దేశించి ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. మీరు ఎవరు? జాతీయ విద్యా విధానంతో మీకు సంబంధం ఏమిటి? ఈ విషయంలో ఎందుకు ఆసక్తి చూపుతున్నారని కోర్టు పిటిషనర్‌ను అడిగింది. తాను తమిళనాడుకు చెందినవాడినని, ఇప్పుడు దిల్లీలో ఉంటున్నట్లు పిటిషనర్ కోర్టుకు

తెలిపారు. తమిళనాడు పాఠశాలల్లో హిందీ బోధించకపోవడం వల్ల హిందీని సులభంగా నేర్చుకోలేకపోతున్నానని ఆయన అన్నారు. పిటిషనర్ తమిళనాడుకు చెందినవాడు కావొచ్చని, అయినప్పటికీ అతను ఢిల్లీలో నివసిస్తున్నారని, ఇక్కడ హిందీ నేర్చుకోవచ్చని జస్టిస్ పార్దివాలా అభిప్రాయపడ్డారు. ఒక రాష్ట్రం తీసుకునే ఏదైనా చర్య ఎన్ఈపీకి వ్యతిరేకంగా ఉంటే, కోర్టు జోక్యం చేసుకోవచ్చని కోర్టు చెప్పింది. అయితే ఈ పిటీషన్‌లో అలాంటిదేమీ కనిపించలేదని వివరించింది. రాష్ట్రంలో ఎన్ఈపీని అమలు చేయబోమని ఇటీవల తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ చెప్పారు. త్రిభాషా సూత్రం ప్రకారం హిందీని రుద్దే ప్రయత్నమని ఆయన అన్నారు.

# కోటాలోనే ఎందుకు విద్యార్థులు చనిపోతున్నారు?

## రాజస్థాన్‌ను నిలదీసిన సుప్రీంకోర్టు

కోచింగ్ సెంటర్ల కేంద్రమైన రాజస్థాన్‌లోని కోటాలో విద్యార్థుల ఆత్మహత్యలు పెరుగుతుండడంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ఏడాదిలో ఇంతవరకు 14 మంది చనిపోవడం తీవ్రమైన విషయమని తెలిపింది. ఇందుకు సంబంధించిన వ్యాజ్యంపై విచారణ చేపట్టింది. పిల్లల ఆత్మహత్యల నివారణకు రాజస్థాన్ ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించింది. దర్యాప్తునకు సిట్‌ను నియమించినట్టు రాజస్థాన్ న్యాయవాది బదులిచ్చారు. విద్యార్థుల ఆత్మహత్యలపై కేసు నమోదులో ఆలస్యంపైన కూడా సుప్రీం ఆగ్రహం వ్యక్తం చేసింది.

# పోలీస్‌స్టేషన్ టాయిలెట్లలో నేరస్తులు మాత్రమే పడిపోతున్నారా...

## ప్రశ్నించిన మద్రాసు హైకోర్టు

రాష్ట్రంలోని పోలీస్?స్టేషన్లలో ఉన్న టాయిలెట్లలో నేరస్తులు మాత్రమే పడిపోయేలా ఉన్నాయా.. అంటూ మద్రాసు హైకోర్టు ప్రశ్నించింది. ఓ కేసులో అరెస్టయి జైలులో ఉన్న కాంచీపురానికి చెందిన జాకీర్ హుస్సేన్ చేతులు, కాళ్లు విరిగాయని.. అతడికి చికిత్స చేయించేలా ఉత్తర్వులు జారీ చేయాలంటూ అతని తండ్రి ఇబ్రహీం మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ న్యాయమూర్తులు జీఆర్ స్వామినాథన్, లక్ష్మీనారాయణన్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. అరెస్ట్ అయిన వ్యక్తి ఎలా గాయపడ్డాడని ధర్మాసనం ప్రశ్నించింది. టాయిలెట్‌లో జారిపడడంతో గాయం ఏర్పడినట్లు

ప్రభుత్వ తరఫు న్యాయవాది తెలిపారు. అయితే ప్రభుత్వ వివవరణపై అసంతృప్తి వ్యక్తం చేసిన ధర్మాసనం... పోలీస్ స్టేషన్ల టాయిలెట్లలో నేరస్తులు మాత్రమే పడి గాయాలు ఏర్పడేలా ఉన్నాయా? అని ప్రశ్నించింది. ఆ టాయిలెట్లను ఇన్స్పెక్టర్లు వినియోగించడం లేదా?, వారికి ఎలాంటి గాయాలు కావడం లేదు కదా? అంటూ అడిగింది. ఇలాంటి చర్యలకు స్వస్తి పలకాలని సూచించిన ధర్మాసనం.. సంబంధిత పోలీసులను విధుల నుంచి తొలగించే పరిస్థితి వస్తుందని హెచ్చరించింది. అనంతరం పిటిషనర్కు చెన్నై రాజీవ్ గాంధీ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స చేయించాలని ఆదేశించి కేసు విచారణ ముగిసినట్లు ఉత్తర్వులు జారీ చేసింది.

# విదేశీ లాయర్లపై కఠిన ఆంక్షలు

## వస్తున్నట్టు ముందుగా బార్ కౌన్సిల్కు చెప్పాలి

## కక్షిదారు వివరాలివ్వాలి.. కొత్త నిబంధనలు జారీ

భారత్లోని కక్షిదారుల తరఫున వాదనలు వినిపించేందుకు వచ్చే విదేశీ న్యాయవాదుల విషయంలో కఠిన నిబంధనలు జారీ అయ్యాయి. గతంలో విదేశీ లాయర్లు వచ్చి వాదనలు వినిపించేందుకు 'ఫ్లై ఇన్.. ఫ్లై అవుట్' విధానం అమలయ్యేది. వారు వచ్చి కేవలం వాదనలు వినిపించి వెళ్లిపోయేవారు. 2023లో తీసుకొచ్చిన నిబంధనల ప్రకారం విదేశీ, అంతర్జాతీయ చట్టాలకు సంబంధించిన కేసులు, కార్పొరేట్ చట్టం కేసులు వాదించేందుకు కార్యాలయాలు తెరవవచ్చు. ప్రస్తుతం కార్యాలయాలు తెరవకుండా కేవలం వాదనలు వినిపించేందుకు వచ్చే విదేశీ లాయర్లకు కొన్ని పరిమితులు పెడుతూ తాజాగా నిబంధనలు విడుదలయ్యాయి. దీని ప్రకారం వాదనలు నిమిత్తం భారత్ వచ్చే లాయర్లు ఆ విషయాన్ని ముందుగా బార్ కౌన్సిల్కు తెలియజేయాలి. క్లయింట్ సమాచారం, కాంటాక్టు వివరాలు ఇవ్వాలి. ఈ సమాచారంతో డిక్లరేషన్ అందజేయాలి. 12 నెలల్లో 60 రోజులకు మించి భారత్లో ఉండడానికి వీల్లేదు. అందువల్ల చేసే పని, ఎంత కాలం ఉండదలచుకున్నారనే విషయాలను ముందుగానే వెల్లడించాలి. దీనిని కొందరు న్యాయవాదులు వ్యతిరేకిస్తున్నారు. సరళీకరణ పేరుతో మరిన్ని ఆంక్షలు పెట్టారని వ్యాఖ్యానిస్తున్నారు. విదేశీ స్టాక్ లిస్టింగ్ కేసులు ఎక్కువ సమ యం తీసుకుంటాయని, అలాంటప్పుడు 60 రోజుల వ్యవధి సరిపోదని అంటున్నారు. తప్పనిసరిగా కార్యాలయాలు ప్రారంభించాలనడం, బార్ కౌన్సిల్కు సమాచారం ఇవ్వాలనడం సరికాదని చెబుతున్నారు. కార్యాలయాలు ఏర్పాటు చేయకుండానే వాదనలు వినిపించేందుకు అవకాశం ఇవ్వడం

వల్ల ఎక్కువ మంది విదేశీ లాయర్లు వచ్చే అవకాశం ఉందని ఇంకొందరు భావిస్తున్నారు. స్థానికులకు నష్టం జరుగుతుందన్న కారణంతో విదేశీ లాయర్ల రాకను మొదటి నుంచీ బార్ కౌన్సిల్ వ్యతిరేకిస్తోంది.

## మహిళా న్యాయవాదిపై సీనియర్ న్యాయవాది భౌతిక దాడి

కేరళ రాజధాని తిరువనంతపురంలోని ఒక సీనియర్ న్యాయవాది బాగోతం బయటపడింది. ఒక కేసు విషయమై మాటామాటా వచ్చి జూనియర్ మహిళా న్యాయవాదైన శ్యామిలిని తీవ్రంగా కొట్టి, శారీరకంగా హింసించాడు సీనియర్ న్యాయవాది బెయ్లిన్ దాస్. అందుబాటులో ఉన్న మాప్ స్టిక్‌తో తన కోపాన్ని తీర్చుకున్నాడు. దీంతో ఈ మేరకు మహిళా న్యాయవాదైన బాధితురాలు ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం బయటకొచ్చింది. దీంతో సదరు సీనియర్ న్యాయవాది మీద భౌతికంగా దాడిచేసిన వ్యవహారంలో కేసు నమోదైంది. నిన్న మే 13న మరో జూనియర్ న్యాయవాదితో జరిగిన గొడవ జరిగిన తర్వాత దాస్ తనపై దాడి చేశాడని మహిళా న్యాయవాది ఫిర్యాదు చేసినట్టు పోలీసులు తెలిపారు. తిరువనంతపురంలోని ప్రముఖ న్యాయవాదైన సదరు బెయ్లిన్ దాస్ తరచూ జూనియర్ లాయర్ల పట్ల ఇలాగే ప్రవర్తిస్తుంటాడని, దాస్ తరచూ చిన్న సమస్యలపై కూడా జూనియర్ సహోద్యోగులపై విరుచుకుపడతాడని, ఇది వర్క్ చేసే చోట తీవ్ర ఇబ్బందికరంగా ఉంటుందని శ్యామిలి తన ఫిర్యాదులో పేర్కొంది. తీవ్రగాయాలపాలైన శ్యామిలి తాను చికిత్స పొందుతున్న మెడికల్ కాలేజీ ఆసుపత్రి వెలుపల మాట్లాడుతూ..బెయిన్ దాస్ తనపై దాడి చేయడం ఇదే మొదటిసారి కాదని పేర్కొంది. తాను ఐదు నెలల గర్భవతిగా ఉన్నప్పుడు, పనిలో వచ్చిన విభేదాల కారణంగా గతంలోనూ తనపై దాడి చేశాడని ఆమె ఆరోపించింది. బెయిన్ దాస్ కొట్టిన దెబ్బలకు తినడం, మాట్లాడ్డం చాలా కష్టంగా ఉందని కనీసం తన బిడ్డకు పాలుకూడా ఇవ్వలేకపోతున్నానని ఆమె వాపోయింది. ఈ నేపథ్యంలో తిరువనంతపురం బార్ అసోసియేషన్ బెయిన్ దాస్‌ను సస్పెండ్ చేసి, ఈ ఘటనకు సంబంధించి అతని నుండి అధికారిక వివరణ కోరింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## కులం ఆధారంగా విరాళాల స్వీకరణ నిరాకరించడం అంటరానితనమే

### మద్రాసు హైకోర్టు

ఆలయ ఉత్సవాల కోసం కులం ఆధారంగా విరాళాలు స్వీకరించేందుకు నిరాకరించడం కూడా అంటరానితనం కిందకే వస్తుందని మద్రాస్ హైకోర్టు పేర్కొంది.

దేశంలో అంటరానితనం వివిధ రకాలుగా, పలు రూపాల్లో ఆచరణలో ఉందని, ఇది కూడా అలాంటి వాటిల్లో ఒకటి అని వ్యాఖ్యానించింది. చెన్నై కుండ్రత్తూర్ తిరునాగేశ్వర్ ఆలయ బ్రహ్మోత్సవ వేడుకలకు నిర్దిష్ట వర్గాల నుంచే విరాళాలు వసూలు చేస్తున్నారని, ఇతర వర్గాల నుంచి నిరాకరిస్తున్నారని ఆరోపిస్తూ పాండ్యరాజన్ అనే వ్యక్తి మద్రాసు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భరత్ చక్రవర్తి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి స్పందిస్తూ.. దేవుడి ఉత్సవాల వ్యవహారంలోనూ కుల ప్రస్తావన రావడం పట్ల విస్మయం వ్యక్తం చేశారు. ఆలయ ఉత్సవాల కోసం అన్ని వర్గాలు విరాళాలు ఇవ్వడానికి అనుమతించాలని, దీనికి తగిన ఉత్తర్వులు జారీచేయాలని దేవాదాయశాఖను ఆదేశించారు.

# వివాహేతర సంబంధం ఉందంటూ భార్యకు విడాకులిస్తే భరణం ఇవ్వాల్సిందే

## గుజరాత్ కోర్టు తీర్పు

వివాహేతర సంబంధం ఉందన్న ఆరోపణతో భార్యకు విడాకులిస్తే భరణం చెల్లించాల్సిందేనని గుజరాత్ కోర్టు స్పష్టమైన తీర్పునిచ్చింది. అహ్మదాబాద్ లోని సబర్మతి ప్రాంతానికి చెందిన వ్యక్తి, గాంధీనగర్ కు చెందిన మహిళను 2006లో వివాహం చేసుకున్నాడు. ఆ తర్వాత వారు అబుదాబిలో కాపురం పెట్టారు. 2012లో వారికి ఒక కుమారుడు పుట్టాడు. ఈ క్రమంలోనే భర్త తనను వేధించాడని, గొడవల కారణంగా భర్తతో ఉండలేక 2016లో తాను ఇండియాకు తిరిగివచ్చానని భార్య కోర్టుకు తెలిపింది. 2017లో సబర్మతి పోలీస్ స్టేషన్‌లో ఆమె తన భర్తపై ఎఫ్ఐఆర్ కూడా దాఖలు చేసింది. గృహ హింస, మహిళల రక్షణ చట్టం కింద ఫిర్యాదు చేసింది. దీంతో భర్త విడాకుల కోసం కోర్టును ఆశ్రయించగా, భార్య అహ్మదాబాద్‌లోని ఫ్యామిలీ కోర్టులో భరణం కావాలని భార్య పిటిషన్ దాఖలు చేసింది. 2023 జనవరి 20వ తేదీన వ్యభిచారం, క్రూరత్వం ప్రాతిపదికన కోర్టు వారిద్దరికీ విడాకులు మంజూరు చేసింది. అయితే అంతకుముందు ఆమెకు, వారి కుమారుడికి కలిపి నెలకు రూ. 40 వేలు భరణం, ఇంటి అద్దె కింద మరో రూ.20 వేలు చెల్లించాలని ఆదేశించింది. అంతేకాకుండా పరిహారం కింద రూ.25 లక్షలు కూడా చెల్లించాలని భర్తను ఆదేశించింది. విచారణ తర్వాత ఆ మహిళ గృహ హింసకు గురైందని గుర్తించింది. అయితే తాను ఏ పనీ లేకుండా ఖాళీగా ఉన్నానని, భరణం చెల్లించుకోలేనని ఆమె భర్త వాదించాడు. కానీ ఆ వాదనను కోర్టు నమ్మలేదు. యూఏఈలో రెండో భార్యతో

జీవిస్తున్న వ్యక్తి భరణం తప్పించుకునేందుకే తాను నిరుద్యోగి అని వాదించాడని నిర్ధారించింది. దీంతో భార్యకు భరణం చెల్లించాల్సిందేనని కోర్టు స్పష్టం చేసింది.

# 14 ఏళ్ల బాలికతో శృంగారంలో పాల్గొన్న వ్యక్తిని నిర్దోషిగా ప్రకటించిన సుప్రీం

పోక్సో కేసుకు సంబంధించి సుప్రీం కోర్టు అరుదైన తీర్పును వెలువరించింది. ఏడేళ్ల క్రితం 14 ఏళ్ల బాలికతో శృంగారంలో పాల్గొని, పోక్సో చట్టం కింద దోషిగా తేలిన వ్యక్తిని సర్వోన్నత న్యాయస్థానం నిర్దోషిగా ప్రకటించింది. పైగా ఈ కేసు అందరికీ 'కనువిప్పు' కావాలి అని తీర్పులో ప్రత్యేకంగా ప్రస్తావించింది. 'తనపట్ల నిందితుడు చేసిన పనిని బాధితురాలు నేరంగా పరిగణించడం లేదు. పైగా అతడితో ఆమె భావోద్వేగంతో కూడిన అనుబంధాన్ని పెంచుకొంది' అని తీర్పులో వ్యాఖ్యానించింది. 2018లో 14 ఏళ్ల బాలికగా ఒకానొక రోజు ఆమె కనిపించకుండా పోయింది. అదేరోజు కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మర్నాడు.. ఆ బాలికను 25 ఏళ్ల వ్యక్తి పెళ్లి చేసుకున్నట్లు కుటుంబసభ్యులకు తెలిసింది. దీనిపై స్థానిక కోర్టులో బాలిక కుటుంబసభ్యులు కేసు వేశారు. విచారణ చేసిన కోర్టు ఆ వ్యక్తికి పోక్సో చట్టం కింద దోషిగా నిర్ధారించి 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. ఈ కేసు క్రమంగా సుప్రీంకోర్టును చేరింది. 'బాధితురాలు ఇప్పుడు ఆ వ్యక్తి భార్య' అని విచారణ సందర్భంగా సుప్రీం ధర్మాసనం ప్రత్యేకంగా ప్రస్తావించింది. 'తన భర్తను శిక్ష నుంచి కాపాడుకునేందుకు ఆమె పోరాటం చేస్తోంది. ప్రస్తుతం ఆ దంపతులకు బిడ్డ కూడా ఉంది. ఈ కేసులో నిందితుడికి శిక్ష విధిస్తే న్యాయం జరగదు. అలా చేస్తే కుటుంబాన్ని విచ్ఛిన్నం చేసినట్లవుతుంది" అని పేర్కొంది.

# పూజా ఖేడ్కర్‌కు సుప్రీంకోర్టు ముందస్తు బెయిలు

సివిల్ సర్వీస్ పరీక్షల్లో మోసం, తప్పుడు మార్గాల్లో ఓబీసీ, డిసేబిలిటీ కోటా ప్రయోజనాలను పొందారన్న ఆరోపణలను ఎదుర్కొంటున్న ఐఏఎస్ మాజీ ప్రొబేషనర్ పూజా ఖేడ్కంకు సుప్రీంకోర్టులో ఉపశమనం లభించింది. ఆమెకు సుప్రీంకోర్టు ముందస్తు బెయిలు మంజూరు చేసింది. దర్యాప్తునకు సహకరించాలని, సాక్ష్యాలను తారుమారు చేయరాదని న్యాయమూర్తులు బీవీ నాగరత్న, సతీష్ చంద్ర శర్మతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం పూజా ఖేడ్కర్‌ను ఆదేశించింది. ఈ సందర్భంగా కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది.

"ఆమె అంతపెద్ద తప్పు ఏమి చేసింది? ఆమె మాదకద్రవ్యాల కింగ్‌పిన్ కాదు. టెర్రరిస్టు కాదు. ఆమె 302 హత్యలు చేయలేదు. ఎన్‌డీపీసీ అఫెండర్ కాదు. ముందు విచారణ పూర్తి

చేయండి. ఆమె అన్నీ కోల్పోయారు, ఎక్కడా ఆమెకు ఉద్యోగం కూడా లేదు" అని బెంచ్ అభిప్రాయపడింది. వాస్తవాలు, పరిస్థితులను పరిశీలించిన దృష్ట్యా ఈ కేసులో ఢిల్లీ హైకోర్టు నుంచి బెయిల్ పొందడానికి ఈ కేసు తగినదిగా భావిస్తున్నామని తెలిపింది. కాగా, ఖేడ్కర్‌కు ముందస్తు బెయిలు ఇచ్చేందుకు ఢిల్లీ పోలీసుల తరఫు న్యాయవాది అభ్యంతరం తెలిపారు. దర్యాప్తునకు ఆమె సహకరిచడం లేదని, ఆమెపై ఉన్న ఆరోపణలు చాలా తీవ్రమైనవని కోర్టుకు విన్నవించారు. ఖేడ్కర్ 2022 యూపీఎస్సీ సివిల్ సర్వీస్ పరీక్షల్లో తప్పుడు సమాచారం ఇచ్చారని, తద్వారా రిజర్వేషన్ ప్రయోజనాలను పొందారని ఆరోపణలు నమోదయ్యాయి. అయితే ఈ ఆరోపణలను ఖేడ్కర్ తోసిపుచ్చారు. ఖేడ్కర్‌పై యూపీఎస్సీ పలు చర్యలు తీసుకుంది. ఆమెపై క్రిమినల్ కేసు నమోదు చేసింది. ఢిల్లీ పోలీసులు సైతం పలు అభియోగాలపై ఆమెపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.


# పోస్టు పెట్టినంత మాత్రాన విద్యార్థినిని అరెస్టు చేస్తారా?

## మహారాష్ట్రపై బాంబే హైకోర్టు ఆగ్రహం



ఆపరేషన్ సిందూర్‌పై సామాజిక మాధ్యమాల్లో వచ్చిన పోస్టును ఫార్వర్డ్ చేసిన ఓ విద్యార్థినిని అరెస్టు చేసినందుకు మహారాష్ట్ర ప్రభుత్వంపై బాంబే హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. పోస్టు పెట్టినంత మాత్రాన అరెస్టు చేస్తారా అని ప్రశ్నించింది. ఆమె జీవితాన్ని నాశనం చేస్తున్నారని ఆక్షేపించింది. పుణెలోని సిన్హగడ్ అకాడమీ ఆఫ్ ఇంజినీరింగ్‌లో రెండో సంవత్సరం చదువుతున్న 19 ఏళ్ల విద్యార్థిని ఈ నెల ఏడో తేదీన ఆపరేషన్ సిందూర్‌పై ప్రభుత్వానికి వ్యతిరేకంగా వచ్చిన ఓ పోస్టును ఫార్వర్డ్ చేసింది. విమర్శలు రావడంతో రెండు గంటల వ్యవధిలోనే దాన్ని తొలగించింది. పోస్టు పెట్టినందుకు కళాశాలకు రావద్దంటూ యాజమాన్యం ఆమెను ఆదేశించింది. పోలీసు కేసు కూడా నమోదు కావడంతో అరెస్టు చేసి ఎరవాడ సెంట్రల్ జైలుకు పంపించారు. కాలేజీ నుంచి తనను పంపించివేయడంపై ఆమె హైకోర్టును ఆశ్రయించారు.

# జస్టిస్ యశ్వంత్ వర్మపై అభిశంసన



ఢిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మను పదవి నుంచి తొలగించే ప్రక్రియ చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైనట్టు సమాచారం. ఈ మేరకు పార్లమెంట్ వానాకాల సమావేశాల్లో అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిసింది. జస్టిస్ యశ్వంత్‌వర్మ ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న సమయంలో.. ఆయన నివాసంలో అగ్నిప్రమాదం జరిగి, భారీగా నోట్ల కట్టలు బయటపడి కలకలం రేగిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు ముగ్గురు జడ్జీలతో ఏర్పాటు చేసిన కమిటీ విచారణ జరిపి... జస్టిస్ వర్మపై వచ్చిన ఆరోపణలు నిజమేనంటూ నివేదిక ఇచ్చింది. మే 9న అప్పటి సుప్రీం చీఫ్ జస్టిస్ సంజీవ్‌ఖన్నా.. ఈ నివేదికను, జస్టిస్ యశ్వంత్‌వర్మను అభిశంసించి, పదవి నుంచి తొలగించాలన్న సిఫార్సును రాష్ట్రపతికి, ప్రధానికి పంపారు. రాష్ట్రపతి ద్రౌపదీముర్ము ఇటీవలే సుప్రీం సీజే ప్రతిపాదనను రాజ్యసభ చైర్మన్, లోక్‌సభ స్పీకర్‌లకు పంపినట్టు సమాచారం. అభిశంసన మార్గదర్శకాల ప్రకారం.. లోక్‌సభ, రాజ్యసభల్లో ఈ ప్రతిపాదనను ప్రవేశపెడతారు. ఒక కమిటీ వేసి ఆరోపణలపై విచారణ చేయిస్తారు. ఆ కమిటీ ఇచ్చే నివేదికను ఇరు సభల్లో ప్రవేశపెట్టి చర్చిస్తారు. అనంతరం ఓటింగ్ నిర్వహిస్తారు. అభిశంసనకు అనుకూలంగా ఓటింగ్ జరిగితే... న్యాయమూర్తి తొలగిస్తూ రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేస్తారు. నిజానికి రాజీనామా చేయాల్సిందిగా జస్టిస్ యశ్వంత్‌వర్మను సుప్రీంకోర్టు కోరినా ఆయన నిరాకరించినట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే అభిశంసనకు సిఫార్సు చేసినట్టు తెలిసింది.

## దర్యాప్తు నివేదికల వెల్లడికి సుప్రీం నిరాకరణ
## అవి రహస్య పత్రాలని స్పష్టీకరణ

అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో లభించిన నగదుకు సంబంధించిన దర్యాప్తు నివేదికలను బయటపెట్టేందుకు సుప్రీంకోర్టు పరిపాలన విభాగం తిరస్కరించింది. సుప్రీంకోర్టు నియమించిన అంతర్గత దర్యాప్తు కమిటీ జస్టిస్

యశ్వంత్ వర్మను తప్పుపడుతూ ఇచ్చిన నివేదిక, ఆయనను అభిశంసించి పదవి నుంచి తొలగించాలని కోరుతూ అప్పటి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా.రాష్ట్రపతి, ప్రధానికి రాసిన లేఖలను సమాచార హక్కు చట్టం కింద ఇచ్చేందుకు నిరాకరించింది. ఇవన్నీ రహస్య పత్రాలని, బయటవారికి వెల్లడిస్తే పార్లమెంటు హక్కులకు భంగం కలుగుతుందని పేర్కొంది. జస్టిస్ వర్మ ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేస్తున్న సమయంలో మార్చి 14వ తేదీ రాత్రి ఆయన నివాసంలో జరిగిన అగ్నిప్రమాదంలో లక్షల రూపాయల నగదు లభించినట్టు వార్తలు వచ్చాయి. దీనిపై ఆ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.కె.ఉపాధ్యాయ్ ప్రాథమికంగా విచారణ జరిపారు. అనంతరం సుప్రీంకోర్టు ఆధ్వర్యంలో ముగ్గురు సభ్యులుగల అంతర్గత కమిటీ విచారణ జరిపింది. ఈ నెల మూడో తేదీన నివేదిక సమర్పించింది. జస్టిస్ వర్మ తీరును తప్పుపట్టింది. నగదు తీసుకున్నట్టు నిర్ధారించింది. ఈ నివేదిక వివరాలన్నింటినీ ఇవ్వాలని సమాచార హక్కు కార్యకర్త కోరగా సుప్రీంకోర్టు నిరాకరించింది.


# ఆన్‌లైన్ గేమ్స్ నియంత్రణ చట్టం సబబే



ఆన్‌లైన్ గేమ్స్‌ను క్రమబద్ధీకరించడానికి తమిళనాడు ప్రభుత్వం చేసిన చట్టం చెల్లుబాటవుతుందని మద్రాసు హైకోర్టు స్పష్టం చేసింది. 2022లో ఆన్‌లైన్ జూదాలు, క్రీడలను క్రమబద్ధీకరించడానికి తమిళనాడు ప్రభుత్వం ప్రత్యేక చట్టం రూపొందించింది. ఆ చట్టంలోని అంశాలను గత ఫిబ్రవరి 14న ప్రభుత్వ గెజిట్‌లో వెలువరించింది. ఆ చట్టం ప్రకారం రాష్ట్రంలో ఆన్‌లైన్ క్రీడలు ఆడేందుకు ఆధార్ నెంబర్ అనుసంధానం చేయాలని పేర్కొంటూ.. అర్ధరాత్రి 12 నుంచి వేకువజాము 5 గంటల వరకు ఆన్‌లైన్ క్రీడలు ఆడటంపై నిషేధం విధించారు. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఆన్‌లైన్ గేమ్స్ సంస్థల తరఫున మద్రాసు హైకోర్టులో పిటిషన్‌లు దాఖలయ్యాయి. ఆ పిటిషన్లపై హైకోర్టు ధర్మాసనం విచారణ జరిపింది. మంగళవారం తీర్పు వెలువరించింది. తమిళనాడు ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టం చెల్లుబాటు అవుతుందని తేల్చిచెప్పింది. గోప్యత ప్రాథమిక హక్కే అయినా ఆ హక్కు సంపూర్ణం కాదని, సమాజానికి హాని కలుగుతుంది కనుక వ్యక్తిగతపరమైన గోప్యతలో జోక్యం తప్పనిసరి అవుతుందని స్పష్టం చేసింది.

# ఉపాధ్యాయుడు మందలించడం.. ఆత్మహత్యకు ప్రేరేపించడం కాదు

పాఠశాల ఉపాధ్యాయుడు విద్యార్థిని మందలించడం ఆత్మహత్యకు ప్రేరేపించినట్లు కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈమేరకు తమిళనాడులో ఒక ఉపాధ్యాయుడిపై నమోదైన కేసును కొట్టివేసింది. ఓ పాఠశాల, హాస్టల్ ఇన్‌చార్జిగా ఉన్న ఉపాధ్యాయుడు మరో విద్యార్థి ఫిర్యాదు మేరకు బాధిత విద్యార్థిని మందలించాడు. ఈ ఘటన అనంతరం అతడు గదిలోకి వెళ్లి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో ఉపాధ్యాయుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణను చేపట్టిన మద్రాస్ హైకోర్టు ఉపాధ్యాయుడిపై ఆత్మహత్యకు ప్రేరేపించిన ఆరోపణలను కొట్టివేయడానికి నిరాకరించింది. దీంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. జస్టిస్ అమానుల్లా, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాల బెంచ్ మద్రాసు హైకోర్టు తీర్పును పక్కన పెట్టింది.




# న్యాయాధికారి పోస్టులకు మూడేళ్ల లా ప్రాక్టీసు తప్పనిసరి

న్యాయాధికారిగా పదవులు చేపట్టాలంటే తొలుత న్యాయవాదిగా పనిచేసిన అనుభవం తప్పనిసరి అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. జ్యుడీషియల్ సర్వీసెసలో ప్రారంభ పదవి అని మున్సిఫ్ మేజిస్ట్రేటుగా చేరాలంటే లాయర్‌గా కనీసం మూడేళ్లు ప్రాక్టీసు చేసి ఉండాలని తెలిపింది. న్యాయ కళాశాలల నుంచి పట్టాలు పొందిన వారు ఎలాంటి ప్రాక్టీసు లేకుండానే నేరుగా మున్సిఫ్ మేజిస్ట్రేటు పదవులు చేపట్టవచ్చంటూ 2002లో ఇచ్చిన ఆదేశాలను పక్కనపెట్టింది. ఈ మేరకు ధర్మాసనం తీర్పు చెప్పింది. ఈ మేరకు నిబంధనలను సవరించాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది.

# బెయిల్ వచ్చిందని ర్యాలీ చేశారు.. రేప్ కేసు నిందితుల నిర్వాకం

## మళ్లీ అరెస్టు చేసిన పోలీసులు



గత ఏడాది జనవరి 8న కర్ణాటకలోని హానగల్ శివారులో ఓ మహిళపై గ్యాంగ్‌రేప్ జరిగింది. ఈ కేసులో 19 మంది నిందితులు. వారిలో ఏడుగురు ప్రధాన నిందితులు. ఈ ఏడుగురు ఈ నెల 20న జైలు నుంచి బెయిల్‌పై విడుదలయ్యారు. ఈ సందర్భంగా వారు 5కార్లతో అనుచరులతో రోడ్ షో చేస్తూ ఇళ్లకు వెళ్లారు. ఆ వీడియోలు వైరల్ అయ్యాయి. దీంతో, ఆ నిందితులపై పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుల్లో నలుగురిని అరెస్టు చేశారు. మిగిలిన ముగ్గురికోసం గాలిస్తున్నారు. రేప్ కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్న యువకులకు కోర్టు ఇటీవల బెయిల్ మంజూరు చేసింది. అయితే విడుదల కాగానే ఆ యువకులంతా బైకులు, కార్లతో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. కర్ణాటక హావేరి జిల్లా అక్కి ఆలూర్ పట్టణంలో ఈ ఘటన చోటు చేసుకుంది. రేప్ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న అఫ్తాబ్ చందనకట్టి, మదర్ సాబ్ మందక్కి, సమివుల్లా లలనావర్, మొహమ్మద్ సాదిక్ అగసిమణి, షోయిబ్ ముల్లా, తౌసిప్ చోటి, రియాజ్ సావికేరి జైలు నుంచి విడుదలయ్యారు. అయితే జైలు నుంచి బయటికి వచ్చిన వారు.. బైకులు, కార్లతో పట్టణంలో ర్యాలీ చేశారు. ఈలలు.. కేకలు వేస్తూ వెళ్లడాన్ని చూసి ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్ణాటక హావేరి జిల్లాలో 2014 జనవరి 8న మహిళపై గ్యాంప్ రేప్ జరిగింది. మైనారిటీ వర్గానికి చెందిన 26 ఏళ్ల మహిళ.. మరో మతానికి చెందిన 40 ఏళ్ల ఆర్టీసీ డ్రైవర్‌తో కలిసి హొటల్ గదిలో ఉంది. ఈ క్రమంలో పైపు రిపేరు పేరుతో గదిలోకి వచ్చిన ఏడుగురు దుండగులు ఆమెను బలవంతంగా కారులో వేరే ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారం చేశారు. ఈ కేసుకు సంబంధించి మొత్తం 19 మందిని అరెస్ట్ చేశారు. కాగా, వీరిలో 7 మంది ప్రధాన నిందితులుగా తేల్చారు. వీరిలో 12 మందిని సుమారు 10 నెలల క్రితం బెయిల్‌పై విడుదల చేయగా.. మిగిలిన ఏడుగురు నిందితులకు ఇటీవల కోర్టు బెయిల్ మంజూరు చేసింది.

ఐరాస శాంతి పరిరక్షక దళాలపై

# 100కు పైగా లైంగిక దుష్ప్రవర్తన ఆరోపణలు

ఐక్యరాజ్యసమితి - ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షక మరియు విధాన మిషన్లలో లైంగిక వేధింపులు మరియు దోపిడీ ఆరోపణలు 2024లో గత 10 సంవత్సరాలలో మూడవసారి 100 దాటిపోయాయి. ఐక్యరాజ్యసమితి ఇటీవల ప్రచురించిన నివేదిక ప్రకారం, 65 ఆరోపణలలో మహిళలు తమపై అత్యాచారం జరిగిందని మరియు తమ పిల్లల కోసం మద్దతు కోరుతున్నారని పేర్కొంది. ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ జనరల్ అసెంబ్లీకి ఇచ్చిన నివేదికలో 125 మంది బాధితులను గుర్తించాయని చెప్పారు. 98 మంది పెద్దలు మరియు 27 మంది పిల్లలు. ఇది 2023లో గుర్తించిన 145 మంది బాధితుల కంటే తక్కువ అని ఆయన అన్నారు.

నివేదిక ప్రకారం, రెండు శాంతి పరిరక్షక మిషన్లు 102 ఆరోపణలలో 82% ప్రాతినిధ్యం వహించాయి. కాంగో 44 మరియు సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్ 40. ఐక్యరాజ్యసమితి తన నీలి హెల్మెట్ల ద్వారా, ముఖ్యంగా రెండు ఆఫ్రికన్ దేశాలలో ప్రముఖులచే మైనర్లపై అత్యాచారం మరియు ఇతర లైంగిక వేధింపుల ఆరోపణల కారణంగా చాలా కాలంగా దృష్టి కేంద్రంగా ఉంది. దక్షిణ సూడాన్ నుండి లెబనాన్ వరకు ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షక మిషన్లలో మరియు హైతీ, కొలంబియా మరియు ఆఫ్ఘనిస్తాన్‌లోని రాజకీయ మిషన్లలో కూడా అనుచిత లైంగిక ప్రవర్తన ఉంది. సెక్రటరీ జనరల్ UN ఏజెన్సీలు, నిధులు మరియు కార్యక్రమాల సిబ్బందిపై లైంగిక దోపిడీ మరియు దుర్వినియోగం గురించి 190 నివేదికలు-2023లో 284 నివేదికలలో తగ్గుదల-మరియు ఐరాస కార్యక్రమాలను అమలు చేసే సంస్థలతో పనిచేస్తున్న ఐరాస యేతర సిబ్బందికి సంబంధించిన 382 నివేదికలు. గుటెర్రెస్ 2017లో ఐక్యరాజ్యసమితి అధిపతి అయినప్పటి నుండి దుర్వినియోగం మరియు లైంగిక దోపిడీకి వ్యతిరేకంగా పోరాటానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారు మరియు అనుచితమైన లైంగిక ప్రవర్తనకు “జీరో టాలరెన్స్” అనే ఐక్యరాజ్యసమితి

విధానాన్ని అమలు చేయడాన్ని ప్రోత్సహించారు. దర్యాప్తును వేగవంతం చేయడానికి ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షక కార్యకలాపాలలో వరుస మార్పులను ప్రారంభించాడు మరియు లైంగిక వేధింపుల బాధితులకు సహాయం చేయడానికి బాధితుల న్యాయవాదిని నియమించాడు. అనుచితమైన లైంగిక ప్రవర్తనపై ఐక్యరాజ్యసమితి శిక్షణ తప్పనిసరి అయినప్పటికీ, 64,585 ఐరాస ఉద్యోగులపై 2024 సర్వే కూడా జరిపించారు. "ఐక్యరాజ్యసమితి వ్యవస్థలోని వ్యక్తులు, వారు సేవలందిస్తున్న సమాజాల మధ్య విశ్వాసాన్ని పెంపొందించడానికి నాయకులు బలమైన, కనిపించే, బాధ్యతాయుతమైన నాయకత్వాన్ని ప్రదర్శించాల్సిన అవసరాన్ని ఇది నొక్కి చెబుతుంది" అని నివేదిక పేర్కొంది. 2006 నుండి, ఐక్యరాజ్యసమితి శాంతిభద్రతలతో కూడిన పిల్లల పితృత్వం మరియు నిర్వహణ గురించి సుమారు 750 వాదనలు ఉన్నాయి, కానీ 500 కంటే ఎక్కువ ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయి. అన్ని వాదనలు దాని పరిష్కారం కోసం మూలం ఉన్న దేశానికి సూచించబడ్డాయి, కానీ మెజారిటీ గణనీయమైన చర్యలు తీసుకోలేదని నివేదిక పేర్కొంది.



# తెలంగాణలో మహిళా ఫైర్‌ఫైటర్ల నియామకానికి కసరత్తు

## ప్రభుత్వానికి అగ్నిమాపక శాఖ ప్రతిపాదన

తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక శాఖలో మహిళా సిబ్బంది నియామకానికి కసరత్తు ప్రారంభమైంది. పోలీస్ నియామకాల మాదిరిగానే అగ్నిమాపక శాఖ పోస్టుల భర్తీలోనూ మహిళలకు 33శాతం రిజర్వేషన్‌ను అమలు చేయాలనే ప్రతిపాదన తెరపైకి వచ్చింది. ఈ మేరకు అగ్నిమాపక శాఖ అధికారులు తాజాగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. దీనికి ఆమోదం లభిస్తే... వచ్చే నోటిఫికేషన్ నుంచి అగ్నిమాపక శాఖ నియామకాల్లో మహిళలకు రిజర్వేషన్ అమల్లోకి రానుంది. అగ్నిమాపక శాఖలో విధులు నిర్వర్తించాలంటే శారీరక దృఢత్వంతోపాటు కఠినమైన ఫిట్‌నెస్ పరీక్షలు పాస్ కావాలి.. దీన్ని దృష్టిలో పెట్టుకొని అగ్నిమాపక శాఖలో మహిళా సిబ్బందిని నియమించడం లేదు. అయితే ఇతర దేశాలు, రాష్ట్రాల్లో అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేసిన తెలంగాణ అగ్నిమాపక శాఖ అధికారులు.. ఫైర్‌ఫైటర్లుగా మహిళలకూ అవకాశం కల్పించాలని ప్రభుత్వానికి నివేదించారు. ఇప్పటి వరకు తమిళనాడు, మహారాష్ట్రల్లోని అగ్నిమాపక శాఖల్లో మాత్రమే మహిళా సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ముంబై అగ్నిమాపక శాఖలో మహిళా సిబ్బంది నియామకం కోసం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 2019లో తమిళనాడు ప్రభుత్వం మహిళల కోసం ప్రత్యేకంగా నియామక ప్రక్రియ చేపట్టగా.. వందలాది మంది శిక్షణ పొంది అగ్నిమాపక శాఖలో చేరారు. ఆ రాష్ట్రాల్లో అనుసరిస్తున్న విధానాల్ని అధ్యయనం చేసిన తెలంగాణ అగ్నిమాపక శాఖ అధికారులు.. ఇక్కడ కూడా మహిళా సిబ్బంది నియామకం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. మహిళా సిబ్బంది నియామకంతోపాటు మరికొన్ని ప్రతిపాదనలను అగ్నిమాపక శాఖ ప్రభుత్వానికి అందజేసింది. ప్రస్తుతం ఉన్న నిబంధనల ప్రకారం హై రైజ్ బిల్డింగ్స్‌కు మాత్రమే అగ్నిమాపక శాఖ అనుమతులు తప్పనిసరి కాగా.. ఇకపై నాన్ హై రైజ్ బిల్డింగ్‌లో నిర్వహించే వ్యాపార సంస్థలకూ దీన్ని వర్తింపజేయాలని ప్రతిపాదించింది. ప్రమాదాలకు ఆస్కారం ఉన్న చిన్న గోదాంలు, పరిశ్రమలు, ఫర్నిచర్ తయారీ యూనిట్లు నాన్ హైరైజ్ బిల్డింగ్స్‌లో ఉన్నా అగ్నిమాపక శాఖ అనుమతి పొందేలా చట్ట సవరణ చేయాలని కోరింది.

# ప్రిన్సిపాల్ గదిలో 12 ఏళ్ల బాలికపై గ్యాంగ్ రేప్

## యూపీలో ఘటన.. ఐదుగురు బాలుర అరెస్టు

పన్నెండేళ్ల దళిత బాలికపై ఐదుగురు బాలురు తాము చదువుకుంటున్న పాఠశాలలోని ప్రిన్సిపల్ గదిలో సామూహిక అత్యాచారానికి ఒడిగట్టారు. ఆ ఘోరాన్నంతా సెల్‌ఫోన్‌లో చిత్రీకరించారు. యూపీలోని మొరాదాబాద్‌లో ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఐదుగురు నిందితులు 12-15 ఏళ్లలోపు వారే. బాలికతో పాటు అదే స్కూల్లో ఏడో క్లాసు నుంచి తొమ్మిదో క్లాసు చదువుతున్నారు. నిందితులంతా కూడా బాలిక ఇంటి సమీపంలోనివారే.. ఆమె సామాజిక వర్గానికి చెందిన పిల్లలే! మే 8న బాలిక, తన ఇంటి సమీపంలో ఆడుకుంటుండగా ఆమెతో మాటలు కలిపిన ఐదుగురు బాలురు.. కొద్దిసేపటికి ఆమెను అక్కడి నుంచి ఎత్తుకెళ్లారు. వారిలో ఒకరి తండ్రి స్కూల్లో వాచ్‌మన్ కావడంతో బడి తాళం చెవులు తెచ్చాడు. బడి గేటు తాళం తీసి.. ఆమెను నేరుగా ప్రిన్సిపల్ గదిలోకి తీసుకెళ్లారు. అక్కడ మత్తు మందు కలిపిన కూల్ డ్రింక్‌ను బాలికతో తాగించారు. ఆమె మత్తులోకి జారుకోగానే ఒకరి తర్వాత మరొకరు అత్యాచారానికి ఒడిగట్టారు. కొన్నిరోజులకు ఆ వీడియోను ఆ బాలురే నెట్‌లో పెట్టారు. ఈ నెల 19న బాలిక పొరుగింటి మహిళ ఆ వీడియోను చూసి.. దారుణం గురించి బాధితురాలి తల్లికి చెప్పింది. బాలిక తల్లి అదేరోజు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకొని జువైనల్ జస్టిస్ బోర్డు ఎదుట ప్రవేశపెట్టారు.

# హెల్మెట్ లేదని బైక్‌ను ఆపే ప్రయత్నం

# కిందపడి వెనుక వచ్చిన టెంపో ఢీకొని బాలిక మృతి

## స్థానికుల ఆగ్రహం.. మండ్య హైవేపై భారీ నిరసన

హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్నవారిని ట్రాఫిక్ పోలీసులు అనూహ్యంగా ఆపే ప్రయత్నం చేశారు. దీంతో బైక్‌పై తల్లిదండ్రులతో కలిసి కూర్చున్న మూడేళ్ల బాలిక అదుపుతప్పి కింద పడిపోయింది. వెనుక వస్తున్న టెంపో వేగంగా చిన్నారిని ఢీకొట్టింది. దీంతో పసిపాప అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. ఈ విషాద ఘటన కర్ణాటక రాష్ట్రం మండ్య జిల్లా కేంద్రంలోని నంద సర్కిల్‌లో సోమవారం జరిగింది. మద్దూరు తాలూకా గొరవనహళ్లికి చెందిన అశోక్, వాణి దంపతుల కుమార్తె ప్రతీక్షను కుక్క

కరిచింది. వైద్యం కోసం పాపను తీసుకుని మండ్యలోని మెడికల్ కళాశాల ఆసుపత్రికి తల్లిదండ్రులు బయలుదేరారు. ఆ హడావుడిలో హెల్మెట్‌ను ధరించలేదు. నంద సర్కిల్‌లో ట్రాఫిక్ పోలీసులు వారి బైక్‌ను ఆపే ప్రయత్నం చేశారు. దీంతో బైకు అదుపు తప్పి చిన్నారి ప్రతీక్ష రోడ్డుపై పడటం, టెంపో వేగంగా వచ్చి ఢీకొట్టడం జరిగిపోయింది. తేరుకుని చూసేలోగా చిన్నారి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. పోలీసుల తీరుకు నిరసనగా తల్లిదండ్రులు హైవేపై బైఠాయించారు. వారికితోడుగా మండ్యవాసులు, వివిధ ప్రజాసంఘాల నాయకులు నిరసనకు దిగారు. దీంతో మండ్య ఎస్పీ మల్లికార్జున ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ట్రాఫిక్ ఏఎసఐలు జయరాం, నాగరాజ్, గురుదేవ్‌ను సస్పెండ్ చేశారు.

# నిర్భయ ఘటనను తలపించేలా.. మహిళను అత్యంత దారుణంగా..

మధ్యప్రదేశ్?లో నిర్భయ తరహా ఘటన చోటుచేసుకుంది. ఓ మహిళపై గుర్తు తెలియని వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ దుర్మార్గులు ఆమె శరీరంతో అత్యంత దారుణంగా వ్యవహరించారు. ప్రాణం ఉన్న మనిషి అని కూడా ఆలోచించకుండా క్రూరంగా ప్రవర్తించారు. ఐరన్ రాడ్డుతో ఆమెపై దాడి చేయటమే కాకుండా.. దాన్ని ఆమె మర్మాంగంలో జొప్పించారు. దీంతో తీవ్ర రక్తస్రావం అయి బాధితురాలు మరణించింది. శు క్రవారం రాత్రి ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖాండ్వా జిల్లాలోని ఓ గ్రామంలో శుక్రవారం ఓ వివాహ కార్యక్రమం జరిగింది. ఈ పెళ్లికి స్థానికులతో పాటు, సమీప గ్రామ ప్రజలు కూడా హాజరయ్యారు. బాధితురాలు కూడా తన కుటుంబంతో కలిసి వివాహానికి హాజరైంది. శుక్రవారం రాత్రి అకస్మాత్తుగా అదృశ్యమైంది. శనివారం ఉదయం గ్రామంలోని ఓ ఇంటి వెనుక బాధితురాలు అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని కొందరు మహిళలు గమనించారు. వెంటనే బాధితురాలి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మహిళ ఇద్దరు కుమారులు ఆమెను ఇంటికి తీసుకెళ్లారు. తనపై జరిగిన ఉదంతాన్ని చెప్పేలోపే బాధితురాలు తుదిశ్వాస విడిచింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మహిళ మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం తరలించారు. గుర్తు తెలియని వ్యక్తులు మహిళ ప్రైవేట్ భాగాల్లో ఇనుప రాడ్డు జొప్పించి గర్భాశయం బయటకు తీసినట్లు డాక్టర్లు వెల్లడించారు. అధిక రక్తస్రావం కారణంగా మహిళ మరణించినట్లు తెలిపారు. ఆమెపై అత్యాచారం జరిగినట్లు స్పష్టం చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇద్దరు అనుమానితులను

అదుపులోకి తీసుకున్నారు.

# బాలికను కిడ్నాప్ చేసి 3 రోజులు అత్యాచారం వేర్వేరు నగరాల్లోని లాడ్జీలకు తిప్పి అఘాయిత్యం

## రామలింగ మఠాధిపతి హఠయోగి లోకేశ్వరస్వామీజీ అరెస్టు

బాలికను కిడ్నాప్ చేసి మూడు రోజుల పాటు లాడ్జీలకు తిప్పి అత్యాచారానికి పాల్పడిన కేసులో బెళగావి జిల్లా రాయభాగ తాలూకా మేకళి గ్రామంలోని రామలింగ మఠాధిపతి హఠయోగి లోకేశ్వరస్వామీజీని పోలీసులు అరెస్టు చేశారు. ఆయనపై పోక్సో, కిడ్నాప్ కేసులు నమోదు చేసినట్టు బెళగావి జిల్లా ఎస్పీ డాక్టర్ బీమాశంకర్ గుళేద చెప్పారు. ఆయన తెలిపిన వివరాల మేరకు పీయూ ప్రథమ సంవత్సరం విద్యార్థిని(17) అనారోగ్యం నేపథ్యంలో రామలింగ మఠాన్ని ఆశ్రయించింది. ఆ మఠాధిపతి హఠయోగి లోకేశ్వరస్వామిజీపై ఆమెకు నమ్మకం, భక్తిభావం ఏర్పడ్డాయి. ఈ నెల 13న తన మేనమామ ఊరికి వెళ్లిన బాలిక కాలి నడకన తిరిగి స్వగ్రామానికి వస్తుండగా అటుగా కారులో వచ్చిన స్వామీజీ డ్రాప్ చేస్తానంటూ కారులో ఎక్కించుకున్నాడు. కారు తమ గ్రామం మీదుగానే వెళ్తుందని తెలిసి బాలిక కారులో ఎక్కింది. అయితే, కారును ఆ గ్రామంలో ఆపకుండా స్వామీజీ బాలికను బెదిరించి రాయచూరుకు తీసుకువెళ్లాడు. అక్కడి ఓ లాడ్జిలో రెండు రోజులపాటు ఉంచి అత్యాచారం చేశాడు. అనంతరం ఈ నెల 15న బాగల్కోటెకు తీసుకెళ్లి, అక్కడి ఓ లాడ్జిలో ఉంచి అత్యాచారం చేశాడు. ఇంటికి వెళతానని బాలిక ఏడవడంతో ఈ నెల 16న మహాలింగపుర బస్టాండ్‌లో వదిలేశాడు. ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. అనంతరం బాలిక ఇంటికి చేరుకొని జరిగిన విషయాన్ని తండ్రికి చెప్పింది. ఈ నెల 21న బాగల్కోటె మహిళా పోలీసస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసును మూడలిగె పోలీసస్టేషన్‌కు బదిలీ చేశారు. దీంతో స్వామీజీని అరెస్టు చేస కోర్టులో హాజరు పరిచారు.

# ఫోన్ సౌండ్ తగ్గించమన్నందుకు భార్యపై యాసిడ్

## బెంగళూరులో దారుణం.. ఆలస్యంగా వెలుగులోకి..

'నిద్రపోవాలి.. ఫోన్ సౌండ్ తగ్గించు' అని చెప్పిన భార్యపై బాత్‌రూమ్ క్లీన్ చేసే యాసిడ్‌ను చల్లాడు భర్త. బెంగళూరు నగరంలోని చిక్కబాణవార ఎన్‌హెచ్‌ఎం లే

అవుట్‌లో ఈ నెల 19న జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బ్యూటీషియన్‌గా పనిచేసే భార్యను ఆ రాత్రి 9 గంటలకు మద్యం కోసం భర్త డబ్బులు అడిగాడు. ఇవ్వనన్నా.. తీవ్రంగా వేధించి డబ్బులు తీసుకుని వెళ్లి మద్యం తాగి వచ్చాడు. ఆ తర్వాత మొబైల్ ఫోన్‌లో సౌండ్ ఎక్కువగా పెట్టుకుని పాటలు వినడం ప్రారంభించాడు. తాను నిద్రపోవాలని, సౌండ్ తగ్గించాలని భార్య కోరడంతో ఆగ్రహించిన భర్త.. బాత్‌రూమ్ క్లీన్ చేసే యాసిడ్‌ను తెచ్చి ఆమెపై చల్లి పరారయ్యాడు. గాయపడ్డ ఆమెను స్థానికులు ఆసుపత్రిలో చేర్చారు. నిందితుడి కోసం గాలిస్తున్నామని చిక్కబాణవార పోలీసులు తెలిపారు.

# అమ్మా.. నేను చోరీ చేయలేదు!

## సూసైడ్ నోట్ రాసి 13 ఏళ్ల బాలుడి ఆత్మహత్య

చేయని దొంగతనాన్ని తనపై మోపారన్న మనస్థాపంలో 13ఏళ్ల బాలుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అంతకుముందు సూసైడ్ నోట్ రాశాడు. అందులో 'అమ్మా నేను దొంగతనం చేయలేదమ్మా' అని బాధపడ్డాడు. పశ్చిమ బెంగాల్‌లోని తూర్పు మిడ్నాపోర్‌లో ఇటీవల ఈ ఘటన జరిగింది. బాలుడి పేరు కృష్ణేందు దాస్. శుభాంకర్ దీక్షిత్ అనే వ్యక్తి స్థానికంగా ఓ దుకాణం నిర్వహిస్తున్నాడు. అతడు షాపులో లేని సమయంలో కృష్ణేందు మూడు చిప్స్ ప్యాకెట్స్ తీసుకొని వెళ్లిపోయాడని స్థానికులు చెప్పారు. దీక్షిత్ కోపంతో నేరుగా బాలుడి ఇంటికి వెళ్లాడు. అక్కడ ఆ బాలుడు దీక్షిత్‌కు 20 రూపాయలు ఇచ్చాడు. అయినా, కృష్ణేందును తనతో పాటు దుకాణానికి తీసుకెళ్లిన దీక్షిత్, చిప్స్ ప్యాకెట్స్ ధర 15రూపాయలను మినహాయించుకొని ఆ చిన్నారికి ఐదు రూపాయలు తిరిగిచ్చేశాడు. ఆపై చిన్నారిని కొట్టి.. స్థానికుల ఎదుట క్షమాపణలు చెప్పించుకున్నాడు. దీంతో బాలుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

## బెంగళూరులో దారుణం.. సూట్‌కేస్‌లో మహిళ మృతదేహం

బెంగళూరు నగర శివార్లలోని అనేకల్ తాలూకా పరిధిలోని చందాపుర రైల్వే బ్రిడ్జ్ సమీపంలో బుధవారం ఉదయం ఓ సూట్‌కేసును స్థానికులు గుర్తించారు. రైల్వే ట్రాక్ పక్కన పడి ఉన్న ఆ సూట్‌కేస్ కాస్తా అనుమానాస్పదంగా ఉండడంతో వెంటనే స్థానిక సూర్యానగర్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. సూట్‌కేసును తెరిచి చూడగా, అందులో ఓ మహిళ మృతదేహం ఉండటంతో వారు నివ్వెరపోయారు. ఆ మహిళను వేరే ప్రాంతంలో హత్య చేసి ఆ

మృతదేహాన్ని సూట్‌కేస్‌లో కుక్కి రైలు నుంచి ఇక్కడ విసిరేసి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు, పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అసలు ఆ మహిళ ఎవరు, ఆమెను హత్య చేసింది ఎవరని తెలుసుకునే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. అన్ని కోణాల్లో దర్యాప్తు ముమ్మరం చేసినట్లు పోలీసులు తెలిపారు.

## ఇద్దరిదీ ప్రేమ వివాహం.. భార్యను అత్యంత దారుణంగా..

భార్యాభర్తల బంధం అన్న తర్వాత గొడవలు సహజం. గొడవలు లేకపోతేనే ఆ బంధం సాఫీగా సాగదు. ఎప్పుడో ఓ రోజు టైటానిక్ షిప్‌లా కుప్పకూలిపోతుంది. అయితే, గొడవలు భార్యాభర్తల బంధాన్ని బలోపేతం చేసేలా ఉండాలి కానీ.. తుంచేలా ఉండకూడదు. కొన్ని సార్లు గొడవల సమయంలో క్షణికావేశం కారణంగా దారుణాలు జరుగుతూ ఉంటాయి. ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవటం.. చంపుకోవటం వంటివి కూడా జరుగుతుంటాయి. తాజాగా, ఓ భర్త గొడవ సందర్భంగా భార్యను కత్తితో పొడిచి చంపేశాడు. పది సార్లు అత్యంత పాశవికంగా పొడిచి మరీ ఆమె ప్రాణాలు తీశాడు. ఈ సంఘటన కర్ణాటకలోని చిక్కమంగళూరులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళితే.. కర్ణాటకలోని చిక్కమంగళూరు తాలూకా, కైమారాకు చెందిన కీర్తి, అవినాష్ భార్యాభర్తలు. 4 ఏళ్ల క్రితం ఇద్దరూ ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి రెండున్నర సంవత్సరాల ఓ కూతురు కూడా ఉంది. గత వారం ఇద్దరూ కలిసి బంధువుల పెళ్లికి కూడా వెళ్లి వచ్చారు. కారణం ఏంటో తెలీదు కానీ, కొద్దిరోజుల క్రితం ఇద్దరి మధ్యా గొడవ మొదలైంది. ఆ గొడవ చినికి చినికి గాలి వానలా తయారైంది. అవినాష్ భార్య మీద కోపంతో ఊగిపోయాడు. కత్తితో ఆమెపై దాడి చేశాడు. దాదాపు 10 సార్లు ఆమెను పొడిచి చంపేశాడు. అనంతరం అక్కడినుంచి పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కీర్తి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నిందితుడు అవినాష్ కోసం గాలిస్తున్నారు. మర్డర్ జరగటానికి గల సరైన కారణం ఏంటో తెలీదని పోలీసులు అన్నారు. దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## భార్యను చంపి.. ముక్కలు చేసి..

ఓ భర్త అదనపు కట్నం కోసం భార్యను చంపేశాడు. అనంతరం ఆమె శవాన్ని ముక్కలు, ముక్కలుగా కోసి కిలోమీటర్ల దూరంలో పడేశాడు. ఈ సంఘటన ఉత్తర ప్రదేశ్‌లో వెలుగు చూసింది. పోలీసులు, మృతురాలి కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ఉత్తర

ప్రదేశ్, శ్రావస్తికి చెందిన సైఫుద్దిన్, సబీనా భార్యాభర్తలు. సైఫుద్దిన్ అదనపు కట్నం తేవాలంటూ భార్యను హింసిస్తూ ఉన్నాడు. రోజు రోజుకు ఆ వేధింపులు పెరిగాయి. భర్త ఎంత ఇబ్బంది పెట్టినా ఆమె మౌనంగా భరించేది. తన తల్లిదండ్రులకు డబ్బులు ఇచ్చేంత స్థోమత లేదని చెప్పేది. అదనపు కట్నం తేకపోవటంతో సైఫుద్దిన్, సబీనాపై పగ పెంచుకున్నాడు. గత వారం లక్నోకు వెళదామని చెప్పి భార్యను వెంట తీసుకెళ్లాడు. మార్గం మధ్యలో ఆమెను చంపేశాడు. భార్య శవాన్ని ముక్కలు, ముక్కలుగా కోశాడు. కొన్ని శరీర భాగాలను కాల్వలో పడేశాడు. మరికొన్ని శరీర భాగాలను 10 కిలోమీటర్ల పరిధిలో అక్కడక్కడా పడేశాడు. తర్వాత ఇంటికి తిరిగి వచ్చాడు. ఆ రోజు సాయంత్రం సబీనా సోదరుడు ఆమెకు ఫోన్ చేశాడు. ఫోన్ స్విచ్ఛాఫ్ అని వచ్చింది. దీంతో అతడు నేరుగా సబీనా ఇంటికి వెళ్లాడు. అక్కడ ఆమె లేదు. ఆమె భర్త మాత్రమే ఉన్నాడు. అతడికి అనుమానం వచ్చింది. పోలీస్ స్టేషన్‌కు వెళ్లి మిస్సింగ్ కంప్లైంట్ ఇచ్చాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సైఫుద్దిన్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. సైఫ్ పొంతనలేని సమాధానాలు చెప్పాడు. రెండు రోజులు బాగా విచారించిన తర్వాత అసలు విషయం బయటపెట్టాడు. పోలీసులు సైఫుద్దిన్‌ను అరెస్ట్ చేసి, జైలుకు తరలించారు.

## రోడ్డుపక్కన పడున్న పసికందును పెంచుకున్న మహిళ.. పెద్దయి తల్లినే చంపిన బాలిక

కలికాలం అంటే ఇదే కాబోలు.. ఓ మహిళ ఎంతో ఉన్నతంగా ఆలోచించి రోడ్డు పక్కన దొరికిన ఓ పాపను దత్తత తీసుకుంది. కన్న కూతురిలా ఎలాంటి లోటు రానీకుండా పెంచుతోంది. అలాంటి తల్లికి అండగా నిలవాల్సిందిపోయి .. ఓ బాలిక దారుణానికి పాల్పడింది. తన మగ స్నేహితులతో కలిసి పెంపుడు తల్లిని చంపేసింది. ఈ దారుణ సంఘటన ఒడిస్సాలో ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఒడిస్సాలోని భుబనేశ్వర్‌కు చెందిన జితేంద్ర కుమార్ పండ, రాజ్య లక్ష్మి భార్యా భర్తలు. దాదాపు 14 ఏళ్ల క్రితం రోడ్డు పక్కన ఓ పాప దొరికింది.పిల్లలు లేని వారు ఆ పాపను దత్తత తీసుకుని పెంచుకుంటూ ఉన్నారు. పాపను దత్తత తీసుకున్న సంవత్సరం తర్వాత జితేంద్ర చనిపోయాడు. ఇక, అప్పటినుంచి రాజ్యలక్ష్మి అన్నీ తానై పాపను పెంచుతూ ఉంది. పాప చదువులకోసం కొన్నేళ్ల క్రితం భుబనేశ్వర్ నుంచి పర్లాకిమిడికి వచ్చి చేరింది. పెంపుడు తల్లి తన కోసం కష్టపడుతోందన్న ఇంగితం లేకుండా ఆ బాలిక ప్రవర్తించింది. బాలిక వయసు ప్రస్తుతం దాదాపు 13 సంవత్సరాలు. 8వ తరగతి చదువుతోంది. బాలిక ఎక్కువగా ఫోన్

వాడుతూ ఉంటుంది. ఈ నేపథ్యంలోనే రథ్, సాహులతో సంబంధం పెట్టుకుంది.

వారు ఆ బాలిక కంటే వయసులో చాలా పెద్ద వారు. ఈ మొత్తం క్రైమ్ కథలో రథ్ కీలక పాత్ర పోషించాడు. అతడే రాజ్యలక్ష్మి మర్డర్ జరగటానికి కారణం అయ్యాడు. రాజ్యలక్ష్మి చనిపోతే.. తాము ఎలాంటి గొడవ లేకుండా రిలేషన్ కొనసాగించవచ్చని.. ఆస్తులను కూడా అనుభవించవచ్చని చెప్పాడు. పెంపుడు తల్లిని చంపే విధంగా బ్రెయిన్ వాష్ చేశాడు. బాలిక పెంపుడు తల్లిని చంపడానికి ఒప్పుకుంది. ఆ బాలిక, రథ్, సాహులు కలిసి మర్డర్ ప్లాన్ వేశారు. ఈ నేపథ్యంలోనే ఏప్రిల్ 29న రాజ్యలక్ష్మికి బాలిక నిద్రమాత్రలు ఇచ్చింది. ఆమె స్పృహ తప్పిపడిపోగానే.. రథ్, సాహులకు ఫోన్ చేసి పిలిపించింది. ముగ్గురు కలిసి దిండుతో రాజ్యలక్ష్మికి ఊపిరి ఆడకుండా చేసి చంపేశారు. ఆ తర్వాత బాలిక ఇతర కుటుంబసభ్యులను పిలిచింది. తల్లి ఎంత పిలిచినా లేవటం లేదని చెప్పింది. వారు వెంటనే ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే రాజ్యలక్ష్మి చనిపోయినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. గుండె పోటు కారణంగా ఆమె చనిపోయిందని అందరూ భావించారు. అయితే, రాజ్యలక్ష్మి సోదరుడు సిబ ప్రసాద్ బాలిక ఫోన్ చెక్ చేయటంతో అసలు విషయం బయటపడింది. అతడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ముగ్గుర్ని అదుపులోకి తీసుకుని విచారించారు. వారు చేసిన నేరం ఒప్పుకున్నారు. చేసిన దారుణానికి శిక్షగా ముగ్గురు జైలులో పడి మగ్గుతున్నారు.

# ఆడపిల్లకు జన్మనిచ్చిందని....

## అత్తమామల వరకట్న వేధింపులు

ఉత్తర్‌ప్రదేశ్‌లో దారుణ ఘటన జరిగింది. ఆడపిల్లకు జన్మనిచ్చిందనే కారణంతో ఓ మహిళతో అమానుషంగా ప్రవర్తించారు ఆమె భర్త, అత్తామామలు. ఆమెపై భర్త మూత్ర విసర్జన చేసి, ఇంటి నుంచి వెళ్లగొట్టాడు. ఈ మేరకు బాధిత మహిళ చేసిన ఫిర్యాదు ఆధారంగా కాన్పూర్ జిల్లా చకేరీ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. దీనిపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. భర్తతో పాటు మరో ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు చెప్పారు. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం బాధిత మహిళకు 2022 ఫిబ్రవరి 19న కాన్పూర్ జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన యువకుడితో పెళ్లి జరిగింది. మహిళ తండ్రి తన స్థోమత మేరకు ఖర్చు చేసి పెళ్లి జరిపించారు. పెళ్లయిన కొన్ని రోజుల తర్వాతి నుంచే మహిళకు వరకట్న వేధింపులు మొదలయ్యాయి. భర్త, అత్తమామలు, మరదలు, ఇతర కుటుంబ సభ్యులు కట్నం పేరుతో సదరు మహిళను శారీరకంగా, మానసికంగా వేధించారు. పుట్టింటికి వెళ్లి రూ.5 లక్షల కట్నం తీసుకురావాలనే షరతు పెట్టారు. అయినా,

మహిళ కట్నం తీసుకురాకపోవడంతో ఆగ్రహించిన భర్త మూత్ర విసర్జన చేసినట్లు ఫిర్యాదులో పేర్కొంది. “నేను ఆడపిల్లకు జన్మనిచ్చిన తర్వాత మెట్టినింట్లో పరిస్థితి మరింత దారుణంగా మారింది. బాబుకు కాకుండా పాపకు జన్మనిచ్చానని అత్తవారింట్లోని వాళ్లంతా నన్ను కసురుకున్నారు. మగ శిశువును కనలేకపోయానని కోపగించుకున్నారు. నా భర్త మద్యం మత్తులో నాపై మూత్రవిసర్జన చేశాడు. 2024 ఆగస్టు 14న ఇంటి నుంచి వెళ్లగొట్టాడు. అప్పటి నుంచి నా బిడ్డతో కలిసి మా పుట్టినింట్లో ఉంటున్నాను. జూదం, మద్యం వ్యసనాల కోసం భర్త నా బంగారు ఆభరణాలన్నీ అమ్మేశాడు” అని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో బాధిత మహిళ పేర్కొంది. అయితే, ప్రస్తుతం ఈ కేసుపై దర్యాప్తు కొనసాగుతోందని, అనంతరం చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని చకేరీ పోలీసు స్టేషన్ ఇంఛార్జి సంతోష్ కుమార్ శుక్లా వెల్లడించారు.

# 299 మంది చిన్నారులపై అత్యాచారానికి పాల్పడిన సర్జన్

## 20 ఏళ్ల జైలుశిక్ష విధించిన ఫ్రాన్స్ కోర్టు

రోగులపై అత్యాచారం చేసిన కేసులో ఓ వైద్యుడికి 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది కోర్టు. ఫ్రాన్స్‌కు చెందిన 74ఏళ్ల మాజీ సర్జన్‌కు శిక్ష విధిస్తూ ఫ్రెంచ్ కోర్టు తీర్పును ఇచ్చింది. దాదాపు రెండు దశాబ్దాలుగా సుమారు జోయల్ లీ స్కారెన్క్ అనే సర్జన్ 299 మంది చిన్నారులపై అత్యాచారానికి పాల్పడినట్లు తేలింది. కాగా ఇప్పటికే 2020లో నలుగురు చిన్నారులపై అత్యాచారం కేసులో 15 ఏళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్నాడు. ఈ క్రమంలోనే అనేక మంది చిన్నారులపై ఇలానే లైంగికంగా వేధించినట్లు బయటపడింది. 1989 నుంచి 2014 వరకు తన వద్దకు వచ్చే చిన్నారులను లైంగింకగా వేధించినట్లు వెల్లడైంది. చాలా మంది బాధితులు అపస్మారక స్థితిలో, మత్తులో ఉన్నప్పుడే లైంగింక దాడి జరిగినట్లు తెలిసింది. ఇందులో దాదాపు 158 మంది అబ్బాయిలు ఉండగా, 141 మంది అమ్మాయిలు ఉన్నారు. 2017 ఏప్రిల్?లో తొలి కేసు వెలుగులోకి వచ్చింది. ఇంటి పక్కన ఉండే ఆరేళ్ల చిన్నారిపై లైంగికంగా వేధించినట్లు తెలిసింది. తనను అసభ్యంగా తాకాడంటూ చిన్నారి తల్లికి చెప్పగా అసలు విషయం బయటకు వచ్చింది. కేసు దర్యాప్తులో భాగంగా ఇంట్లో విచారణ చేపట్టగా అనేక సాక్ష్యాలు దొరికాయి. సుమారు 3లక్షల ఫొటోలు, 650 వీడియోలు లభించాయి.

# కామాంధుడికి 30 ఏళ్లు జైలు

## చెన్నై మహిళా కోర్టు సంచలన తీర్పు

## అన్నా యూనివర్సిటీ విద్యార్థినిపై లైంగిక దాడి కేసు

## ఐదు నెలల్లోనే వెలువడిన తీర్పు

తమిళనాడులోని అన్నా యూనివర్సిటీ విద్యార్థినిపై లైంగిక దాడి కేసులో చెన్నై మహిళా కోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. కేసులో నిందుతుడైన జ్ఞానశేఖర్‌ను దోషిగా ప్రకటించిన కోర్టు తాజాగా అతనికి జీవిత ఖైదు విధించారు. కనీసం 30 సంవత్సరాలైన జైలు శిక్ష అనుభవించాల్సిందేనని కోర్టు తీర్పు ఇచ్చింది. నేర తీవ్రతను ప్రస్తావిస్తూ జడ్జి ఎం.రాజలక్ష్మి ఈ తీర్పును ప్రకటించారు. ఘటన జరిగిన ఐదు నెలల్లోనే ఈ కేసులో తీర్పు వెలువడటం విశేషం. భారతీయ న్యాయ సంహితలో పలు సెక్షన్లు, ఇన్ఫర్మేషన్ యాక్ట్, తమిళనాడు ప్రొహిబిషన్ ఆఫ్ హెరాస్‌మెంట్ ఆఫ్ ఉమన్ యాక్ట్ కింద జ్ఞానశేఖరన్‌పై మోపిన అభియోగాలు నిరూపణ కావడంతో అతన్ని దోషిగా ప్రకటిస్తూ కోర్టు గత వారం తీర్పు ఇచ్చింది. దీంతో అతన్ని అరెస్టు చేసి సెంట్రల్ జైలుకు తరలించారు. సోమవారంనాడు కోర్టు తీర్పు నేపథ్యంలో అతన్ని జైలు నుంచి కోర్టు ముందు హాజరుపరిచారు. అన్నా వర్సిటీ వద్ద బిర్యానీ అమ్ముకునే జ్ఞానశేఖరన్ గత ఏడాది డిసెంబర్ 23వ తేదీ రాత్రి క్యాంపస్‌లోకి చొచ్చుకొచ్చి విద్యార్థిని తన ఫ్రెండ్‌తో మాట్లాడుతుండగా చాటుగా మొబైల్ ఫోన్ నుంచి దానికి రికార్డు చేశాడు. దానిని లీక్ చేస్తానని, విద్యార్థిని తండ్రి, కాలేజీ అధికారులకు పంపుతానని బెదరించారు. అక్కడున్న ఫ్రెండ్‌ను కొట్టి ఆ విద్యార్థినిని సమీపంలోని పొదల్లోకి తీసుకువెళ్లి అత్యాచారం చేశాడు. ఆమె ఐడీ కార్డు, తండ్రి ఫోన్ నెంబర్ ఫోటోలు తీసుకుని, తనను కలుస్తూ ఉండమని, లేదంటే వీడియోలు లీక్ చేస్తానని బెదిరించాడు. కాగా, ఈ ఘటనతో విద్యార్థిలోకం భగ్గుమంది. రాజకీయ విమర్శలు, ఆందోళనల నేపథ్యంలో కేసును సిట్‌కు అప్పగించాలని మద్రాసు హైకోర్టు ఆదేశించింది. నిందితుడు డీఎంకేతో సంబంధాలున్నందున కేసు జాప్యం చేస్తున్నారంటూ విపక్ష నేతలు విమర్శలకు సైతం దిగారు. ఈ క్రమంలో నిందితుడిపై ఫిర్యాదు నమోదైన 24 గంటల్లోనే పోలీసులు అతన్ని అరెస్టు చేశారు. బలమైన సాక్ష్యాలు కూడా సంపాదించడంతో 5 నెలల్లోనే కేసు విచారణ పూర్తయి నిందితుడిని దోషిగా కోర్టు ప్రకటించింది. కాగా, ఈ కేసులో కొన్ని ప్రశ్నలు ఇంకా

మిగిలే ఉన్నాయని, ఈ నేరంలో ప్రమేయమున్న వారిని కూడా శిక్షించాలని ఏఐడీఎంకే నేత ఎడప్పాడి పళనిస్వామి డిమాండ్ చేశారు. జ్ఞానశేఖర్ తన ఫోనులో ఎవరినో 'సర్' అని సంబోధించినట్లు బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొందని, ఆ సార్ ఎవరో తేలాలని అన్నారు. దీనిపై చెన్నై పోలీస్ చీఫ్ ఎ.అరుణ్ వెంటనే వివరణ ఇచ్చారు. జ్ఞానశేఖరన్ తన ఫోన్‌లో ఎవరితోనే మాట్లాడుతున్నట్లు నటించాడని, ఈ కేసులో ఇతర అనుమానితులెవరూ లేరని తెలిపారు.

# మహిళా ఉద్యోగిని లైంగికంగా వేధించిన అటవీ అధికారి డిస్మిస్

## దోషిగా నిర్ధారణ .. మూడు నెలల జైలు శిక్ష

తన కార్యాలయంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగి పట్ల అసభ్యంగా ప్రవర్తించి, లైంగికంగా వేధించిన అటవీశాఖ అధికారిని ప్రభుత్వం డిస్మిస్ చేసిన ఉదంతమిది. దొరవారిసత్రం మండలం నేలపట్టు బర్డ్ శాంక్చురీలో ఫారెస్టు రేంజి అధికారిగా పనిచేస్తూ 2023లో కింది స్థాయి మహిళా ఉద్యోగి పట్ల అనుచితంగా వ్యవహరించిన బి.వరప్రసాద్ తాజాగా ఉద్యోగం నుంచీ ఉద్వాసనకు గురయ్యారు. ఆయనపై క్రిమినల్ కేసు నమోదు కాగా కోర్టు ఇటీవల జైలు శిక్ష విధించిన నేపథ్యంలో డిస్మిస్ వేటు వేసింది. దీనికి సంబంధించిన వివరాలిలా వున్నాయి. సూళ్లూరుపేట వైల్డ్‌లైఫ్ మేనేజ్‌మెంట్ డివిజన్ పరిధిలోని నేలపట్టు బర్డ్ శాంక్చువరీలో ఇదివరకూ బి.వరప్రసాద్ ఫారెస్టు రేంజి అధికారిగా పనిచేశారు. ఆ సమయంలో 2023 జూన్ 9న ఉదయం కార్యాలయంలో పనిచేసే ఫారెస్టు బీట్ అధికారి షేక్ అర్షత్తున్నీసాను లైంగికంగా వేధించారు. దీనిపై బాధితురాలు దొరవారిసత్రం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేశారు. సూళ్లూరుపేట జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో కేసు విచారణ జరిగింది. విచారణలో అటవీ రేంజి అధికారి బి.వరప్రసాద్ నేరం రుజువు కావడంతో కోర్టు మూడు నెలల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 5 వేలు జరిమానా విధిస్తూ ఈ ఏడాది ఏప్రిల్ 9న తీర్పు ప్రకటించింది. కోర్టు జైలు శిక్ష విధించిన నేపథ్యంలో ప్రస్తుతం ప్రకాశం జిల్లా మార్కాపురంలో అటవీ రేంజి అధికారిగా కొనసాగుతున్న వరప్రసాద్‌ను ఉద్యోగం నుంచీ డిస్మిస్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అసాధారణ గెజిట్ నోటిషికేషన్ జారీ చేసింది.

# 17 మంది నవజాత శిశువులకు 'సిందూర్' పేరు

దేశవ్యాప్తంగా ఇప్పుడు 'ఆపరేషన్ సిందూర్' పేరు మారుమోగుతోంది. పహల్గాం ఉగ్రదాడితో రగిలిపోతున్న భారత్ మే 7న 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాక్ ఉగ్రశిబిరాలపై దాడి చేసి 100 మందికి పైగా ఉగ్రవాదులను మట్టుబెట్టింది. పాక్ వెన్నులో వణుకుపుట్టిస్తూ ఇండియన్ ఆర్మీ చేపట్టిన ప్రతీకార చర్యపై దేశవ్యాప్తంగా ప్రశంసలు కురుస్తున్నాయి. కొందరైతే తమ నవజాత శిశువులకు 'సింధూర్' అనే పేర్లు పెడుతూ సైనిక జవాన్ల పట్ల తమకున్న గౌరవాన్ని చాటుకుంటున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని కుషీనగర్ జిల్లాలో అసాధారణ రీతిలో ఈ సెంటిమెంట్ కనిపిస్తోంది. కేవలం రెండు రోజుల్లో 17 మంది ఆడ శిశువులకు వారి కుటుంబ సభ్యులు 'సిందూర్' అంటూ నామకరణం చేశారు. ఆపరేషన్ సిందూర్ తమ జీవితాల్లో ఎంతటి ప్రాముఖ్యత సంతరించుకుందో చాటుకున్నారు. సిందూర్ అనేది ఇప్పుడు కేవలం ఒక పేరు కాదని, ఒక భావోద్వేగానికి, దేశం పట్ల గౌరవానికి ప్రతీక అని కుషీనగర్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్‌కే షాహి తెలిపారు. బెడిహరి గ్రామానికి చెదిన అర్చనా షాహి ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇటీవల ఆడశిశువుకు ఆమె జన్మనిచ్చారు. పాపకు సిందూర్ పేరు పెట్టాలని ముందే నిర్ణయించుకున్నట్టు చెప్పారు. పహల్గాం ఉగ్రదాడిలో పలువురు మహిళలు తమ భర్తలను పొగొట్టుకుని పసుపు-కుంకుమలను కోల్పోయారని, ఆపరేషన్ సిందూర్ అందర్నీ గర్వంగా తలెత్తుకునేలా చేసిందని చెప్పారు. ఆ కారణంగానే తమ ఆడబిడ్డకు సిందూర్ పేరు పెట్టుకున్నామని చెప్పారు. కాగా, సిందూర్ పేరు తమకు ఎంతో స్ఫూర్తినిచ్చిందని ఆమె భర్త అజిత్ షాహి తెలిపారు. పడ్రౌనా ఏరియాలోని మదన్ గుప్తా కుటుంబ సభ్యులు కూడా ఇదే సెంటిమెంట్ వ్యక్తం చేశారు. గుప్తా కోడలు కాజల్ గుప్తా కొత్తగా పుట్టిన తన ఆడశిశివుకు సిందూర్ పేరు పెట్టారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా ఆపరేషన్ సిందూర్ మొదలైనప్పటి నుంచి తనకు పుట్టబోయే శిశివుకు సిందూర్ పేరు పెట్టాలని తన కోడలు నిర్ణయం తీసుకున్నట్టు మదన్ గుప్తా తెలిపారు. ఈ పేరుతో ఆపరేషన్ సిందూర్ ఎప్పటికి తమకు గుర్తుండిపోతుందని, అందరూ గర్వించే క్షణాలుగా తాము ఆ సందర్భాన్ని సెలబ్రేట్ చేసుకుంటామని చెప్పారు. తనకు పుట్టిన ఆడశిశువుకు సిందూర్ పేరు పెట్టుకోవడం గర్వకారణంగా భావిస్తున్నట్టు భతాహి బాబు గ్రామానికి చెందిన మరో మహిళ తెలిపింది. సిందూర పెరిగి పెద్దయిన తర్వాత తన పేరుకు అర్థం తెలుసుకుని భరతమాతకు పేరు తెస్తుందని ఆశిస్తున్నట్టు చెప్పింది.

# ప్రసూతి చికిత్స పితామహుడు డా. వి.ఎన్. శిరోద్కర్



ప్రపంచవ్యాప్తంగా 'శిరోద్కర్ కుట్టు' కనుగొన్న వ్యక్తిగా ఖ్యాతిగాంచారు. ఆయన మహిళల వ్యాధుల చికిత్సకు ఎంతో దోహదం చేశారు. విఠల్ నగేశ్ శిరోద్కర్ 1899లో గోవాలోని శిరోదా గ్రామంలో జన్మించారు. గ్రామం పేరు మీదనే వారికి ఆ ఇంటి పేరు సంక్రమించింది. హుబ్లీలో విద్యను అభ్యసించి ముంబయిలోని గ్రాంట్ వైద్య కళాశాలలో చేరారు. 1923లో ఎం.బి.బి.ఎస్. పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. గర్భధారణ, ప్రసూతి శాస్త్రంలో స్పెషలైజేషన్‌తో ముంబయి విశ్వవిద్యాలయం నుంచి 1927లో యం.డి. పట్టా పొందారు. ఉన్నత విద్య కోసం ఇంగ్లాండు వెళ్లారు. అక్కడ పని చెయ్యటం ఆయనకు ఎంతగానో తోడ్పడింది. ఆధునిక శస్త్ర చికిత్స విధానాలను అక్కడ నేర్చుకున్నారు. ఎందరో ప్రముఖ వైద్యులను, శాస్త్రజ్ఞులను కలుసుకున్నారు. 1931లో ఎఫ్.ఆర్.సి.ఎస్ (ఇంగ్లాండు) పొందారు. ముంబయిలో జె.జె.ఆసుపత్రులకు గర్భధారణ, స్త్రీల వ్యాధులలో గౌరవ ఆచార్యులుగా నియుక్తులయ్యారు. జె.జె.ఆసుపత్రి చాలా విశిష్టమైనది. 4,000 పడకలతో ప్రపంచంలోని పెద్ద ఆసుపత్రులలో అది ఒకటి. 1,500 పట్టా స్థాయి, 650 పిజి స్థాయి విద్యార్థులు ఉంటారు. అది ఆసియాలో ఆధునిక విద్యకు 175 సంవత్సరాల చరిత్ర కలిగిన ఒక ప్రాచీన విద్యా సంస్థ. ఇదే సంస్థలో చారిత్రక ఖ్యాతి గాంచిన రాబర్ట్ కాచ్ పనిచేశారు. క్షయ వ్యాధి మీద చేసిన పరిశోధనలకు అతనికి నోబెల్ పురస్కారం లభించింది. మామూలు గర్భసంచిలో గర్భాశయ ముఖ కండరం మూసుకుని ఉంటుంది. బలహీన గర్భాశయంలో గర్భాశయ ముఖద్వారం తెరుచుకుని ఉంటుంది. 1955లో డాఎం శిరోద్కర్ గర్భాశయ ముఖానికి శస్త్ర చికిత్స గురించి వివరించారు. కాల పరీక్షకు నిలబడి ఈనాటికీ దీనిని పాటిస్తున్నారు. గర్భాశయ లోపాలను సరిచేయడానికి ప్రత్యేకమైన పరికరాలను రూపొందించారు. దీనికి చాలా మార్పులు చేశారు కానీ అసలు శస్త్ర చికిత్స ఇప్పటికీ అద్వితీయంగా నిలిచి ఉంది.

1951లో పారిస్ లోనూ, 1956లో నేపుల్స్ లోనూ జరిగిన అంతర్జాతీయ

సమావేశాలలో తన శస్త్ర చికిత్స గురించి వివరించారు. ఒక హాలీవుడ్ తారకి ఈ పద్ధతితో శస్త్ర చికిత్స సఫలం కావడంతో అతడి ఇటాలియన్ బంధం మరింత బలపడింది. అన్ని రకాల గర్భస్రావాలకు తన శస్త్ర చికిత్స పని చేయదని తెలుసుకోగల సునిశిత బుద్ధి ఆయనది. ఎటువంటి పరిస్థితుల్లో తన శస్త్ర చికిత్స ఉపయోగపడే అవకాశముందో, ఎటువంటి వాటిలో ఉపయోగపడదో స్పష్టంగా విశదీకరించారు. సామాన్యంగా అనిపించే ప్రతిదానిని ప్రశ్నించే తత్వం కలిగిన డాఎం శిరోద్కర్‌కు శస్త్ర చికిత్స, దాని వెనక ఉన్న ఆలోచన తట్టి ఉండొచ్చు. ఈ శస్త్ర చికిత్సపై రాసిన పత్రానికి పీఠికలో ఇలా పేర్కొన్నారు "పరిపూర్ణం కాని శస్త్ర చికిత్స పద్ధతుల పట్ల నేను సంతృప్తి చెందేవాడిని కాదు. ఎప్పటి నుంచో వాడుకలో ఉన్న పద్ధతులను మెరుగు పరచడానికి నాకు ఉపాయాలు తడుతూ ఉండేవి." 1951 జూన్‌లో ఫ్రెంచి గైనకాలజీ సంఘ రజతోత్సవ ఉత్సవాల్లో, గర్భాశయ ముఖం చుట్టూ మూడు వరుసల కాటన్ పెట్టడానికి శస్త్ర చికిత్స చేసే విధానాన్ని చిత్రాల ద్వారా చూపించారు. ఆ తరువాత కరిగే గుణం ఉన్న కాటన్ ఇందుకు సరైనది కాదని గమనించారు. ఈ పద్ధతిని మార్చి 4-6 నెలల్లో అకారణంగా జరిగే గర్భస్రావాలకు తొడ నుంచి తీసిన నారపట్టి (ఫాసియా లాటా) లినెన్లు ఉపయోగించే శస్త్ర చికిత్సను రూపొందించారు. దీనినే ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా "శిరోద్కర్ శస్త్ర చికిత్స"గా పిలుస్తున్నారు. ఇందుకు రాబోయే తరాలు ఎప్పటికీ ఆయనను గుర్తుంచుకుంటాయి. 1971 మార్చి 7న ప్రొఫెసర్ శిరోద్కర్ ముంబయిలో మరణించారు. ఆయన తల్లి గర్భాశయ ముఖ క్యాన్సర్‌తో మరణించారు. డాఎం శిరోద్కర్ కుమారుడు మనోహర్ శిరోద్కర్ ఈ వ్యాధికి ఉన్న వైరల్ కారణాలపై పరిశోధనలు జరిపారు. క్యాన్సర్ కారకమైన 'రౌస్ సర్కోమా' వైరస్ (మొట్టమొదటగా కనుగొన్న క్యాన్సర్ వైరస్) గురించి పరీక్షలు జరిపారు. తరవాత ఆయన పూనాలోని రాక్ ఫెల్లర్ ఫౌండేషన్ వైరస్ పరిశోధనా కేంద్రంలో పని చేశారు. యువకునిగా ఉన్నప్పుడు మనోహర్ శిరోద్కర్, ప్రఖ్యాతిగాంచిన తన తండ్రి పట్ల ఆరాధన ఉన్నప్పటికీ, వైద్య విద్య పట్ల ఆసక్తి చూపలేదు. 1976లో, మనోహర్, ఆయన భార్య సుధ డాఎవి.ఎన్.శిరోద్కర్ జ్ఞాపక పరిశోధన ఫౌండేషన్ ని స్థాపించారు. ఈ సంస్థ మనోహర్ శిరోద్కర్, ఆయన తండ్రి కన్న కలలకు రూపాన్ని ఇచ్చింది. ఈ సంస్థ అట్టడుగు వర్గాలకు చెందిన యువతుల్లో గర్భాశయ ముఖ క్యాన్సర్ పరీక్షలు జరుపుతుంది. వైరల్ వ్యాధులను నయం చేయడానికి కొత్త జైవిక ఏజెంట్లపై పరిశోధనలు చేస్తుంది. సాంఘిక వైద్యంలో ఆసక్తి కనపరిచేవారు. గర్భస్రావాలకు సంబంధించిన శాంతీలాల్ షా కమిటీలో ఆయన సభ్యులు. భారత దేశంలో కుటుంబ నియంత్రణ సంస్థను స్థాపించారు. 1971లో భారత ప్రభుత్వం ఆయనను పద్మ విభూషణ్ బిరుదుతో సత్కరించింది.

# 100 మందిని మొసళ్లకు వేసిన సీరియల్ కిల్లర్ 'డాక్టర్ డెత్'



పవిత్రమైన వైద్య వృత్తి చేపట్టి ప్రజల పాలిట మృత్యువులా మారాడు ఓ వ్యక్తి. కనిపించిన వారినల్లా చంపుకుంటూ పోతూ 'డాక్టర్ డెత్' గా ప్రసిద్ధి గాంచాడు. పోలీసుల చేతికి చిక్కినట్టే చిక్కి పదే పదే తప్పించుకు తిరుగుతున్న ఈ సీరియల్ కిల్లర్ ఈసారి విచిత్రమైన స్థితిలో పట్టుబడ్డాడు. సుమారు 100 మందికి పైనే చంపినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 'డాక్టర్ డెత్'.. రెండేళ్లుగా ఏ జీవినైనా హింసించడం ఘోరమైన పాపమని.. దానికి ప్రాయశ్చిత్తమే లేదంటూ నీతి సూక్తులు వల్లిస్తున్నాడు. ఏ కారణం లేకుండానే పరమ కిరాకతంగా మనుషుల్ని హతమార్చే 'డాక్టర్ డెత్' సడన్‌గా ఎందుకు మారిపోయాడు.. ఏ స్థితిలో పోలీసులకు పట్టుబడ్డాడు.. 'డాక్టర్ డెత్' గా పేరుగాంచిన సీరియల్ కిల్లర్ 67 ఏళ్ల దేవేంద్ర శర్మ రెండేళ్లుగా పరారీలో ఉన్నాడు. తీహార్ జైలులో జీవిత ఖైదు అనుభవిస్తున్న దేవేంద్ర.. 2023 ఆగస్టులో పెరోల్‌పై విడుదలయ్యాడు. అప్పటినుంచీ పోలీసుల కన్నుగప్పి తప్పించుకు తిరుగుతున్నాడు. ఢిల్లీ, జైపూర్, అలీఘర్, ఆగ్రా, ప్రయాగ్‌రాజ్ ఇలా దాక్కునేందుకు ప్రదేశాలను మారుస్తూనే ఉన్నాడు. ఇటీవల తన ఐడెంటిటీ బయటపడకుండా ఉండేందుకు రాజస్థాన్‌లో దౌసాలోని ఒక ఆశ్రమంలో పూజారిగా అవతారమెత్తాడు. ప్రజలకు జీవహింస మహాపాపమంటూ ఉపదేశాలు ఇస్తూ నమ్మిస్తున్నాడు. అయితే, పోలీసులకు సీరియల్ కిల్లర్ ఆచూకీ తెలియడంతో వారు కూడా భక్తులమంటూ ఆశ్రమానికి వెళ్లారు. సినీఫక్కీలో దొంగ పూజారిని అరెస్టు చేశారు. దీంతో ఇన్నాళ్లూ అతడు దైవస్వరూపుడని నమ్మిన భక్తులు ఒక్కసారిగా షాకయ్యారు. ఏడు హత్య కేసుల్లో జీవిత ఖైదు, ఒక కేసులో మరణశిక్ష

ఎదుర్కొంటున్న 'డాక్టర్ డెత్' నిజస్వరూపం తెలిసి భయభ్రాంతులకు గురవుతున్నారు. బ్యాచిలర్ ఆఫ్ ఆయుర్వేద మెడిసిన్ అండ్ సర్జరీ డిగ్రీ పొందిన దేవేంద్ర శర్మ ఆయుర్వేద వైద్యుడిగా పనిచేసేవాడు. ఇతడిపై 27 హత్య, కిడ్నాప్, దోపిడీ కేసులు ఉన్నాయి. ఢిల్లీ, రాజస్థాన్, హర్యానాలలో ఏడు వేర్వేరు కేసుల్లో దేవేంద్రకు జీవిత ఖైదు విధించింది కోర్టు. మరో కేసులో గుర్గావ్ కోర్టు మరణశిక్ష విధించింది. 1994లో గ్యాస్ డీలర్‌షిప్ ఒప్పందంలో భారీ ఆర్థిక నష్టాలు రావడం శర్మ ఈ నేరాలకు పాల్పడ్డాడని పోలీసులు చెబుతున్నారు. 1998- 2004 మధ్య కిడ్నీ రాకెట్‌ను నిర్వహించడం ద్వారా అపఖ్యాతి పాలయ్యాడు. అనేక రాష్ట్రాల్లో వైద్యులు, మధ్యవర్తుల సహాయంతో 125 కి పైగా అక్రమ కిడ్నీ మార్పిడికి సహకరించాడు.

> 'డాక్టర్ డెత్' గా పేరుగాంచిన సీరియల్ కిల్లర్ దేవేంద్ర శర్మ రెండేళ్లుగా పరారీలో ఉన్నాడు. ఢిల్లీ, జైపూర్, అలీఘర్, ఆగ్రా, ప్రయాగ్‌రాజ్ ఇలా దాక్కునేందుకు ప్రదేశాలను మారుస్తూనే ఉన్నాడు. ఇటీవల తన ఐడెంటిటీ బయటపడకుండా ఉండేందుకు రాజస్థాన్‌లో దౌసాలోని ఒక ఆశ్రమంలో పూజారిగా అవతారమెత్తాడు. ప్రజలకు జీవహింస మహాపాపమంటూ ఉపదేశాలు ఇస్తూ నమ్మిస్తున్నాడు. అయితే, పోలీసులకు సీరియల్ కిల్లర్ ఆచూకీ తెలియడంతో వారు కూడా భక్తులమంటూ ఆశ్రమానికి వెళ్లారు. సినీఫక్కీలో దొంగ పూజారిని అరెస్టు చేశారు.

మృతదేహాలను మొసళ్లకు ఆహారంగా..

2002- 2004 మధ్య అనేకమంది టాక్సీ, ట్రక్ డ్రైవర్లను దారుణంగా హత్య చేయడంతో దేవేంద్ర పేరు వెలుగులోకి వచ్చింది. టాక్సీ డ్రైవర్లను చంపి వారి వాహనాలను గ్రే మార్కెట్‌లో విక్రయించేవాడు. మృతి చెందిన వారి ఆధారాలు బయటకు రాకుండా ఉండేందుకు ఉత్తరప్రదేశ్ కాస్‌గంజ్‌లో మొసళ్లతో నిండిన హజారా కాలువలో మృతదేహాలను వేసేవాడు. వరస హత్యలు, కిడ్నీ రాకెట్ కేసులో తొలిసారి 2024లో పోలీసులు అరెస్టు చేయడంతో.. ఈ సీరియల్ కిల్లర్ కు 'డాక్టర్ డెత్' అనే పేరొచ్చింది. పెరోల్ పై విడుదలైన తర్వాత శర్మ పరారీలో ఉండటం ఇదే మొదటిసారి కాదు . 2020లో అతడు 20 రోజుల పెరోల్ తర్వాత తిరిగి రాలేదు. ఏడు నెలల గాలింపు చర్యల అనంతరం ఢిల్లీలో పోలీసులకు పట్టుబడ్డాడు.మళ్లీ జూన్ 2023లో సరితా విహార్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో శర్మకు రెండు నెలల పెరోల్ లభించింది. కానీ, ఆగస్టు 3, 2023 తర్వాత నుంచి కనిపించకుండా పోయాడు. ఎట్టకేలకు రెండేళ్ల తర్వాత రాజస్థాన్ ఆశ్రమంలో పోలీసులకు దొరికిపోయాడు.

# భారతీయ నర్సుల విదేశీ బాట

## అధిక వేతనాల కోసం

## ఇతర దేశాలకు వెళ్తున్న హెల్త్‌కేర్ నిపుణులు

ప్రపంచవ్యాప్తంగా హెల్త్‌కేర్ నిపుణుల కొరత తీవ్రంగా ఉంది. భారత్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొని ఉంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) సిఫారసుల ప్రకారం ప్రతి వెయ్యి మంది ప్రజలకు ముగ్గురు నర్సులు ఉండాలని చెబుతుంటే.. భారత్‌లో మాత్రం కేవలం 1.96 మంది ఉన్నారు. ఈ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న హెల్త్‌కేర్ నిపుణుల కొరతను ఉపయోగించుకుంటూ.. భారత్‌లోని నర్సులు అధిక జీతం, మెరుగైన పని పరిస్థితులను కోరుకుంటూ విదేశాల బాట పడుతున్నారు. ఈ సంఖ్య ఇటీవలి కాలంలో ఎక్కువగా ఉంది. జర్మనీ, ఐర్లాండ్, మాల్టా, యూఏఈ, బెల్జియం వంటి దేశాలకు వెళ్తున్నారు. ఆయా దేశాలు పోటీపడి మరీ అధిక వేతనాలు, ఇతర అదనపు ప్రయోజనాలను ఆఫర్ చేస్తూ వారిని నియమించుకుంటున్నాయి. 'బోర్డర్‌ప్లస్' అనే వర్క్‌ఫోర్స్ మొబిలిటీ సంస్థ డాటా ప్రకారం.. జర్మనీలో కొత్తగా నియామకమైన ఒక నర్సు నెలకు 2,700 యూరోల (సుమారు రూ.2.6 లక్షలు) జీతాన్ని ఆశించవచ్చు. లైసెన్స్ పొందిన తర్వాత రూ.3.2 లక్షల వరకు పోయే అవకాశం ఉంది. అదే భారత్‌లోని ప్రైవేటు ఆస్పత్రుల్లో అయితే నర్సులకు వేతనం రూ.20 వేల నుంచి రూ.40 వేల మధ్య ఉంటుంది. ఐర్లాండ్ రూ.1.7 లక్షలు-రూ.2.5 లక్షల వేతనాన్ని ఆఫర్ చేస్తోంది. యూఏఈలో ప్రారంభ వేతనం రూ.75 వేల నుంచి రూ.1.5 లక్షల వరకు ఉంది. దీంతో పాటు ఆదాయం పన్ను రాయితీ, ఇతర ప్రయోజనాలను కల్పిస్తోంది. మెరుగైన వైద్య నైపుణ్యాలు, ఇంగ్లిష్ భాషా ప్రావీణ్యం, ఎక్కడికైనా వెళ్లేందుకు సమ్మతి వంటి అంశాలతో భారతీయ నర్సులకు ఎక్కువ డిమాండ్ కనిపిస్తోంది. క్రిటికల్ కేర్, జెరియాట్రిక్స్ (వృద్ధుల ఆరోగ్య సంరక్షణ), ప్రినేటల్ (ప్రసవానికి ముందు) సేవల్లో మనవాళ్లకు అధిక డిమాండ్ ఉంది. అయితే, నర్సులు విదేశాలకు వెళ్లడం దేశ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థపై ప్రభావం చూపే అవకాశం ఉందనే వాదన వినిపిస్తోంది. ఇప్పటికే భారత్‌లో డబ్ల్యూహెచ్‌వో సిఫారసు చేసిన నర్సుల సంఖ్య కంటే చాలా తక్కువగా ఉన్నారు. నర్సుల వలసలు ఈ కొరతను మరింత పెంచుతాయి. ఈ నేపథ్యంలో నర్సింగ్ నైపుణ్యాన్ని దేశంలోనే నిలుపుకోవడానికి దేశీయంగా పని పరిస్థితులను మెరుగుపరచడం, పోటీ వేతనాలు ఆఫర్ చేయడం, శిక్షణా సదుపాయాలను విస్తరించడం వంటి చర్యలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.



# పర్యావరణ పరిరక్షణ.. మానవ మనుగడకు తొలి అడుగు

ప్రపంచ పర్యావరణ దినోత్సవం అంటే ప్రకృతి పరిరక్షణ కోసం చేపట్టాల్సిన చర్యల గురించి చర్చించడానికి ఒక రోజును ప్రత్యేకంగా నిర్దేశించి ప్రపంచ దేశాలన్నీ ఒక్క చోట చేరుతాయి. ఈ సందర్భంగా ప్రకృతికి హాని చేసే చర్యల గురించి, వాటి కారణంగా జరుగుతున్న నష్ట నివారణ చర్యలు గురించి చర్చలు జరుపుతారు. ప్రతి ఏడాది జూన్ 5వ తేదీ ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకుంటాం. ప్రకృతికి మానవుడికి అవినాభావ సంబంధముంది. అది ఎంత దగ్గర సంబంధమంటే మనిషి ప్రకృతిలో పుడతాడు. ప్రకృతిలో ఆడుతూ పాడుతూ పెరుగుతాడు. ప్రకృతిని ఉపయోగించుకుంటూ ఎదుగుతాడు. చివరకు తన స్వార్థం కోసం ప్రకృతిని నాశనం చేయడానికి కూడా సిద్ధపడతాడు. ఈ వినాశానికి

అడ్డుకట్ట వేయడానికే ప్రపంచ దేశాలు ఒక వేదిక మీదకు వచ్చి ఒక్కో సంవత్సరం ఒక్కో దేశంలో మానవ వినాశనానికి గురైన పర్యావరణాన్ని కాపాడడానికి చేపట్టాల్సిన చర్యల గురించి చర్చించాలని నిర్ణయించింది. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ కోసం ప్రత్యేకించి ఒక రోజు ఏర్పాటు చేస్తే మంచిదన్న ఉద్దేశ్యంతో జూన్ 5వ తేదీ ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకోవాలని ప్రపంచ దేశాలు నిర్ణయించాయి. తొలిసారిగా 1972 లో ఐక్యరాజ్య సమితి నిర్వహించిన పర్యావరణ పరిరక్షణ సదస్సు లో వాతావరణ మార్పులను గమనిస్తూ తగు చర్యలు చేపట్టాల్సిన అవసరముందని గుర్తించారు. స్వీడన్ వేదికగా జూన్ 5వ తేదీ ప్రపంచ పర్యావరణ దినంగా జరపాలని తొలిసారి ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. 1973 నుంచి జూన్ 5న ప్రతియేటా ప్రపంచ పర్యావరణ దినం ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటున్నాం. ఐరాస ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రాం ఏటా ఏదో ఒక అంశంతో పర్యావరణంపై ప్రజల్లో అవగాహన పెంచే ప్రయత్నాలు చేస్తూ వస్తోంది. ప్రతి సంవత్సరం జూన్ 5 రాగానే ప్రపంచం మొత్తం పర్యావరణం గురించి మాట్లాడుకుంటుంది. ప్రపంచ పర్యావరణ దినోత్సవం అనగానే ప్రకృతి ప్రేమికులకు మనసులో ఏదో తెలియని ఆనందం కలుగుతుంది. నిత్యం ప్రకృతితో మమేకమై ఉండే ప్రతి ఒక్కరికీ ఈ రోజు పండుగలానే ఉంటుంది. ఒక్కసారిగా బాల్య స్మృతులు గుర్తుకు వస్తాయి. చిన్నప్పుడు స్కూల్లో మొక్కలు నాటడం, ప్రతిరోజూ నాటిన మొక్కలకు నీళ్లు పోయడం, తిరిగి స్కూల్ విడిచి పెట్టి వెళ్లే సమయంలో మొక్కలను విడిచి పెట్టలేక బాధ పడటం ఇవన్నీ మర్చిపోలేని మధుర స్మృతులు. ప్రకృతిని ప్రేమించడం కంటే గొప్ప విషయం ఏముంటుంది. అలా ఎవరైనా ప్రకృతిని మనస్ఫూర్తిగా ప్రేమిస్తే పర్యావరణానికి హాని చెయ్యలేరు. పర్యావరణాన్ని పాడు చేస్తే మానవ వినాశనం తప్పదు. పర్యావరణ దినోత్సవం రోజున ప్రపంచ దేశాలన్నీ ఓ చోట సమావేశమై భూమికి కలుగుతున్న రకరకాల కాలుష్యాలను తగ్గించడానికి చేపట్టాల్సిన చర్యల గురించి చర్చలు జరిపి నష్ట నివారణకు చేయవలసిన కార్యక్రమాల పట్ల తీర్మానాలు చేస్తాయి. భూతాపాన్ని తగ్గించే అవగాహన కార్యక్రమాలు జరుపుతాయి. జూన్ 5 పర్యావరణ దినోత్సవం సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులకు ఈ రోజు ప్రాధాన్యాన్ని ఉపాధ్యాయులు వివరిస్తారు. విద్యార్థులచేత మొక్కలు నటించడం, ప్లాస్టిక్ రహిత సమాజ ఆవశ్యకతను వివరించడం చేస్తారు. ప్రతి సంవత్సరం పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రపంచ దేశాలు సమావేశాలు చర్చలు జరిపి, తీర్మానాలు చేసి చేతులు దులుపుకుంటున్నాయి. ఆ తీర్మానాలు ఆచారంలో పెట్టడంలో అందరూ విఫలం అవుతున్నారు. భూమికి అత్యంత హాని చేస్తుంది మానవుడే! ప్రపంచ దేశాల ప్రభుత్వాలు రక రకాల కాలుష్యాలను సముద్రంలోకి పంపిస్తున్నాయి. ఇక ప్లాస్టిక్ వ్యర్థాల సమస్య ఉండనే



ఉంది. ఇటీవల కొన్ని సంస్థలు జరిపిన సర్వే ప్రకారం చివరకు ఎవరెస్టు శిఖరం కూడా ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయింది. పర్వతారోహకులు ఆహారపదార్థాలు ఉంచిన ప్లాస్టిక్ కంటైనర్లు తమతో తీసుకెళ్లి అక్కడే వదిలేసి రావడంతో ఈ అనర్థం జరుగుతోంది. నానాటికి పెరుగుతున్న జనాభా కారణంగా పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా సిమెంట్ రోడ్లు, తారు రోడ్లతో మట్టి అన్నదే కనుమరుగై పోయింది. భూమిలోకి వర్షపు నీరు ఇంకే అవకాశమే లేకుండా పోయింది. పెరిగిన జనాభాకు అనుగుణంగా ఇళ్లు నిర్మించడం కోసం చెట్లన్నీ నరికేస్తున్నారు. చివరకు పంట పొలాలు కూడా ఇళ్ల స్థలాలుగా మారిపోతుంటే భూతాపం పెరగక ఏమవుతుంది? ఎండలు పెరిగిపోతున్నాయి, వేడి పెరుగుతోంది అంటున్నారే కానీ దానికి కారణం ఎవరు? మనం కాదా! పదిమంది నివసించే ప్రదేశంలో 100 మందికి పైగా ఉంటున్నారు. భూగర్భ జలాలన్నీ తోడేస్తున్నారు. అందుకే భూతాపం పెరిగిపోతోంది. ఇక విచ్చలవిడిగా వాడుతున్న ప్లాస్టిక్ భూతం పర్యావరణానికి చేసే హాని అంతా ఇంతా కాదు. ఇలా ఎవరికీ వారు 'నేనొక్కడినే పడేస్తే ఏమవుతుందిలే!' అని అనుకుంటూ ఎవరికి వారు శాయశక్తులా పర్యావరణానికి హాని చేస్తున్నారు. మార్కెట్టుకు బజారుకు వెళ్లేటప్పుడు ఇంటి నుంచి కాటన్ సంచులు తీసుకెళ్లడం అలవాటు చేసుకోవాలి. విహారయాత్రలకు వెళ్లినప్పుడు ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్‌ను ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా చెత్తకుండీలో వేయాలి. లేదా అన్నీ సేకరించి ప్లాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్‌కు అందజేయాలి. ప్రతి ఒక్కరు ప్రతి మూడు నెలలకు ఒక మొక్కను నాటడం అలవాటు చేసుకోవాలి. మీ బంధుమిత్రుల ఇళ్లల్లో పుట్టిన రోజులు, పెళ్లి రోజులు వంటి ప్రత్యేక సందర్భాల్లో వారికి పూల మొక్కను కానుకగా ఇవ్వాలి. మీరు కూడా అలాంటి కానుకలనే స్వీకరించాలి. మన పిల్లలకు చిన్న వయసు నుంచే పర్యావరణ ప్రాధాన్యతను తెలియజేసి ప్రకృతి ప్రేమికులుగా మార్చాలి. ఎవరో వస్తారు ఏదో చేస్తారని ఎదురు చూస్తూ ఉండకుండా మన పరిసరాలను మనమే శుభ్రంగా ఉంచుకోవాలి. మన ఇంట్లో చెత్తను మనమే శుభ్రం చేసుకోవాలి. మనం నివసించే మన వీధి, మన ఊరు, మన దేశాన్ని కూడా మనమే శుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచుకోవాలి. చివరగా ప్రకృతిని ప్రేమిద్దాం. మనం ఆరోగ్యంగా ఉందాం. మన భవిష్యత్ తరాలకు ఆరోగ్యకర సమాజాన్ని అందించాల్సిన బాధ్యత మనందరి మీదా ఉంది.


కోరలు చాస్తున్న కాలుష్యం..
కనుమరుగవుతున్న పచ్చదనం
పారిశ్రామిక వ్యర్థాలతో క్షీణిస్తున్న ప్రజారోగ్యం

# బాలలు, మానవ హక్కులు

బాలల సంక్షేమం కోసం భారత రాజ్యాంగంలో కొన్ని ప్రాథమిక హక్కులను పొందుపర్చారు. భారత రాజ్యాంగం మూడో భాగంలో పొందుపర్చిన ఆర్టికల్ 14 నుండి 32 వరకు గల ప్రాథమిక హక్కులన్నీ బాలలకు వర్తిస్తాయి. ఆదేశిక సూత్రాల్లోని ఆర్టికల్స్ 39, 45, 51 కూడా బాల హక్కుల గురించి చెబుతున్నాయి.

ఆర్టికల్ 15 (3) : బాలల సంక్షేమం కోసం ప్రత్యేక శాసనాలు చేసే అధికారం ప్రభుత్వాలకు ఉంది.

ఆర్టికల్ 19 : వాక్ స్వాతంత్ర్య హక్కు, సమావేశమయ్యే హక్కు, సంఘాలు ఏర్పాటు చేసుకునే హక్కు, నివశించే హక్కు, ఆస్థి హక్కు, ఇష్టమైన వృత్తి, వ్యాపార హక్కు బాలలకూ వర్తిస్తాయి.

ఆర్టికల్ 21 : వ్యక్తిగత ప్రాణ రక్షణ, వ్యక్తిగత స్వేచ్ఛ బాలలకూ వర్తిస్తాయి.

ఆర్టికల్ 21 ఎ : రాజ్యం 6 నుండి 14 సంవత్సరాల బాలలందరికీ రాజ్యం (స్టేట్) చట్ట ప్రకారం నిర్ణయించిన విధంగా ఉచిత, నిర్బంధ విద్యని అందిస్తుంది.

ఆర్టికల్ 23 : వ్యక్తుల్ని వ్యాపార వస్తువులుగా మార్చడం, వారి చేత నిర్బంద సేవలు చేయించడం వంటివి చట్ట విరుద్ధం అనేది బాలలకూ వర్తిస్తుంది.

ఆర్టికల్ 24 : పధ్నాలుగు సంవత్సరాలలోపు బాలల్ని కర్మాగారాలలో పనిలో పెట్టుకోవడం లేదా ప్రమాదకరమైన పనుల్లో నియమించడం నిషేదించబడింది.

ఆర్టికల్ 39 (2) : చిన్న వయసులో బాలల్ని వారి వయస్సుకు, శక్తికి మించిన పనుల్లో నియమించరాదు.

ఆర్టికల్ 39 (ఎఫ్) : బాలల్ని దారిద్ర్యం, నైతిక పతనాల నుండి కాపాడుతూ వారు స్వేచ్ఛ, గౌరవం, ఆరోగ్యంతో వికాసం పొందడానికి అన్ని సదుపాయాలను సమకూర్చాలి.

ఆర్టికల్ 45 : ఆరు సంవత్సరాల వయస్సు వచ్చేంత వరకూ శిశు సంరక్షణ, విద్యని రాజ్యం అందించే ప్రయత్నం చేస్తుంది.

ఆర్టికల్ 15 ఎ (కె) : 6 నుంచి 14 సంవత్సరాల వయస్సు బాలలకు తల్లిదండ్రి లేదా సంరక్షకుడు విద్యావకాశాలను కల్పించాలి.

# బాలల హక్కుల ఒప్పందం-ఒడంబడిక

ఐక్యరాజ్యసమితి 1989 నవంబరు 20న ఆమోదించిన బాలల హక్కుల ఒడంబడికతో సంక్రమించిన హక్కులు....

1. మనుగడ హక్కు (రైట్ టు సర్వైవల్)


ఆర్టికల్ 6(1) : ప్రతి బాల జీవించే హక్కును కలిగి ఉన్నాడని రాజ్యాలు గుర్తించాలి.

ఆర్టికల్ 6(2) : బాల గరిష్ఠంగా బ్రతకడానికి, అభివృద్ధి చెందడానికి రాజ్యాలు బాధ్యత వహించాలి.

2. సంరక్షణ హక్కు (రైట్ టు ప్రొటెక్షన్)

ఆర్టికల్ 2(2) : బాలల తల్లిదండ్రులు, చట్టబద్ధ సంరక్షకులు, లేదా కుటుంబ సభ్యుల స్థాయి, పనులు, వ్యక్తపరచిన అభిప్రాయాలు, లేక నమ్మకాల కారణంగా ఉండే అన్ని రకాల వివక్ష లేక శిక్ష నుండి రాజ్యాలు బాలను సంరక్షించడానికి తగిన చర్యలను చేపడతాయి.

ఆర్టికల్ 3(2) : బాల చక్కగా ఉండటానికి తగిన సంరక్షణ, శ్రద్ధను రాజ్యాలు తీసుకుంటాయి.



ఆర్టికల్ 3(2) : బాలల సంరక్షణలోని సంస్థలు, సేవలు, సౌకర్యాలు నిర్ధారించిన ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా రాజ్యాలు శ్రద్ధ తీసుకుంటాయి.

ఆర్టికల్ 16(2) : బాల ఏకాంతం, కుటుంబం, గృహం లేదా ఉత్తర ప్రత్యుత్తరాల విషయాల్లో చట్టవిరుద్ద చొరబాటు నుండి రక్షణ పొందే హక్కు ఉంది.

ఆర్టికల్ 19 : లైంగిక వేధింపు, దోపిడీతోపాటు శారీరక, మానసిక నష్టం లేక నిర్లక్ష్యం నుండి రక్షణకు రాజ్యాలు తగిన చట్టపరమైన, పరిపాలనా పరమైన, సామాజికపరమైన, విద్యాపరమైన చర్యల్ని తీసుకుంటాయి. ఆర్టికల్ 23(2), 23(3) : వైకల్యం గల పిల్లలకు ప్రత్యేక చికిత్స, సంరక్షణ రాజ్యాలు అందించాలి.

ఆర్టికల్ 24(1), 24(2): అత్యున్నతమైన ప్రామాణికత గలిగిన ఆరోగ్యాన్ని పొందే అర్హతను కలిగి ఉన్నాడు. రాజ్యాలు సంరక్షణను చూడటంతోపాటు ఆరోగ్యం, విద్య, శిశు మరణాలు తగ్గించడంపై శ్రద్ధ వహించాలి.

ఆర్టికల్ 26 : బాల సామాజిక భద్రతను గుర్తించి దానిని సాధించడానికి తగిన చర్యలను రాజ్యాలు చేపడతాయి.

ఆర్టికల్ 32(1) : రాజ్యాలు బాల ఆర్థిక దోపిడీకి గురికాకుండా ఉండాల్సిన హక్కుని గుర్తించి తగిన చర్యలను చేపడతాయి.

ఆర్టికల్ 33 : మత్తు పదార్థాల చట్ట విరుద్ధ వినియోగం, మత్తు పదార్థాల తయారీ లేదా దొంగ రవాణాలో భాగస్వామ్యులవడం నుండి రాజ్యాలు బాలల్ని కాపాడతాయి.

ఆర్టికల్ 36 : బాలల సంక్షేమానికి సంబంధించిన అన్ని రకాల దోపిడీల నుండి బాలను రాజ్యాలు కాపాడతాయి.

3. అభివృద్ధి (వికాస) హక్కు (రైట్ టు డెవలప్‌మెంట్)

ఆర్టికల్ 6(1), 6(2) : ప్రతి బాల జీవించే హక్కును కలిగి ఉన్నాడు. గరిష్టంగా బ్రతికేలా, అభివృద్ధి చెందేలా రాజ్యాలు చూడాలి.

ఆర్టికల్ 18 : బాలని పెంచే, అభివృద్ధి పర్చే బాధ్యత తల్లిదండ్రులు ఇద్దరికీ ఉందనే సూత్రాన్ని గుర్తించేలా చేయటానికి తగిన చర్యలను చేపడతాయి.

ఆర్టికల్ 27(1) : బాలశారీరక, మానసిక, నైతిక, సాంఘిక అభివృద్ధి కోసం ప్రామాణికమైన జీవనాన్ని గడిపే హక్కు ఉందని రాజ్యాలు గుర్తిస్తాయి.

ఆర్టికల్ 27(2) : బాల అభివృద్ధికి తల్లిదండ్రులదే ప్రాథమిక బాధ్యత.

ఆర్టికల్ 27(3) : బాలల సంక్షేమం కోసం తల్లిదండ్రులకి లేదా ఇతరులకి రాజ్యాలు సహాయాన్ని అందిస్తాయి.

4. పాల్గొనే హక్కు (రైట్ టు పార్టిసిపేషన్)

ఆర్టికల్ 12(1) : ప్రభావితం చేసే అన్ని అంశాల్లో తన అభిప్రాయాల్ని స్వేచ్ఛగా వ్యక్తపర్చే అవకాశాన్ని అలా చేయగల సామర్థ్యం గలిగిన బాలకు ఇవ్వాలి.

ఆర్టికల్ 23(1) : గౌరవం, స్వీయ నిర్ధరతను కల్పిస్తూ సముదాయంలో బాల చురుకుగా పాల్గొనగలిగిన పరిస్థితుల్లో శారీరకంగా లేక మానసికంగా వైకల్యం గలిగిన బాల సంపూర్ణమైన, చక్కని జీవనాన్ని గడపడాన్ని రాజ్యాలు గుర్తించాలి.

ఆర్టికల్ 31(2) : బాల పరిపూర్ణంగా సాంస్కృతిక, కళాత్మక జీవనంలో పాల్గొనే హక్కుని రాజ్యాలు గౌరవించడం, అభివృద్ధి పరచడంతోపాటుగా అతనికి సాంస్కృతిక, కళాత్మక, వినోదాత్మక, తీరిక సమయం కృత్యాల్లో పాల్గొనడానికి సరైన, సమాన అవకాశాలను రాజ్యాలు కల్పించాలి.


5. విద్యాహక్కు (రైట్ టు ఎడ్యుకేషన్)

ఆర్టికల్ 28(1) : రాజ్యాలు బాలల విద్యా హక్కుని గుర్తించి బాలలందరికీ నిర్బంధ, ఉచిత ప్రాథమిక విద్యను అందించాలి. వివిధ రకాల మాధ్యమిక, సాధారణ, ఔద్యోగిక, విద్యను అభివృద్ధి పర్చి అందించాలి సరైన ప్రాతిపదికన అందరికీ ఉన్నత విద్య అందుబాటులో ఉండేలా చూడాలి.

ఆర్టికల్ 28(2) : పాఠశాలలో క్రమశిక్షణ మానవ గౌరవానికి తగినట్లుగా, ఈ ఒప్పందానికి అనుగుణంగా ఉండేలా చర్యలు చేపట్టాలి.

ఆర్టికల్ 28(3) : విద్యకు సంబంధించిన అంశాల్లో, ప్రపంచంలో నిరక్షరాస్యతని తగ్గించే విషయాల్లో, శాస్త్రీయ, సాంకేతిక జ్ఞానంలో, నూతన బోధనా పద్ధతుల్లో రాజ్యాలు సహకరించుకోవాలి.

ఆర్టికల్ 29(1) : బాలమూర్తిమత్వం, ప్రతిభలు, మానసిక, శారీరక సామర్థ్యాలు పూర్తి స్థాయికి అభివృద్ధి చెందాలి. మానవ హక్కుల, ప్రాథమిక స్వాతంత్ర్యాల పరంగా విద్య అభివృద్ధి చెందాలి. స్వేచ్ఛాయుత సమాజంలో బాధ్యతాయుత జీవనం కోసం, స్వేచ్ఛాయుత సమాజంలో బాధ్యతాయుత నైతిక, జాతీయ, మత, ప్రాంతీయ ప్రజలందరితో అవగాహన, శాంతి, సహనం, లింగ సమానత్వం, స్నేహం కలిగి ఉండే భావాన్ని విద్య ద్వారా అభివృద్ధి చెందించాలి. పర్యావరణం గురించిన విద్య ఉండాలి.


HUMAN RIGHTS
సమస్యల లోగిళ్లలో కానరాని హక్కుల ఊసు..
ప్రాథమిక హక్కులతోనే మానవ సమాజానికి నిజమైన వెలుగు

# మానవ హక్కుల సార్వత్రిక ప్రకటన



ఐక్యరాజ్య సమితి (యునైటెడ్ నేషన్స్) అవతారికలో ప్రాథమిక మానవ హక్కులపై నమ్మకం వెలిబుచ్చింది. యునైటెడ్ నేషన్స్ చార్టర్‌లోని ఆర్టికల్ 1లో 'జాతి, లింగ, భాష, మతం లాంటి వివక్షత లేకుండా మానవ హక్కులను, ప్రాథమిక స్వేచ్ఛలను గౌరవించడం, పెంపొందించడం కోసం అంతర్జాతీయ సహకారం తీసుకోబడుతుంది" అని వివరించబడింది. యునైటెడ్ నేషన్స్ సర్వ ప్రతినిధి సభ (జనరల్ అసెంబ్లీ) 1948 డిసెంబర్ 10న మానవ హక్కుల సార్వత్రిక ప్రకటనను ఆమోదించింది. ఈ మేరకు ప్రతి ఏడాది డిసెంబర్ 10న ప్రపంచ వ్యాప్తంగా మానవ హక్కుల దినోత్సవాన్ని జరుపుకుతున్నారు.

1.స్వేచ్ఛగా పుట్టిన మానవులంతా గౌరవం, హక్కుల విషయంలో సమానమే.

2. ఎలాంటి జాతి, రంగు, లింగం, భాష, మతం, రాజకీయ లేక ఇతర అభిప్రాయం, జాతి లేక సామాజిక ఆవిర్భావం, ఆస్తి, పుట్టుక లేక ఇతర స్థితి కారణంగా ఎలాంటి వివక్షత లేకుండా ఈ ప్రకటనలోని అన్ని హక్కులు. స్వేచ్ఛలు పొందడానికి ప్రతి ఒక్కరూ అర్హులు.

3. ప్రతి ఒక్కరూ జీవన, స్వేచ్ఛ, రక్షణ హక్కులను కలిగి ఉన్నారు.

4. ఏ వ్యక్తి బానిసగా లేదా సేవలో కట్టివేయబడరాదు. అన్ని రకాల బానిసత్వం, బానిస వ్యాపారం నిషేధింపబడుతుంది.

5. ఎవరూ చిత్రహింసకు లేదా క్రూరత్వానికి, అమానుషత్వానికి లేక దండనకు గురి చేయబడరాదు.

6. ప్రతిచోట చట్టం ముందు వ్యక్తిగా గుర్తింపు పొందే హక్కు, ప్రతి ఒక్కరికీ ఉంది.

7. చట్టం ముందు అందరూ సమానులే. ఎలాంటి వివక్షతా లేకుండా చట్ట సంరక్షణకు అందరూ సమానంగా అర్హులే.

8. రాజ్యాంగం లేదా న్యాయం ద్వారా కల్పించబడిన ప్రాథమిక హక్కులను ఉల్లంఘించే

చర్యలపై పరిహారం పొందేందుకు న్యాయస్థానాలకు వెళ్లే హక్కును ప్రతి ఒక్కరూ కలిగి ఉన్నారు.

9. ఆర్బిట్రరీగా ఎవరినీ అరెస్టు చేయడం, నిర్బంధించడం లేదా ప్రవాసంలోకి పంపడం చేయరాదు.

10. తన హక్కులు, ఆబ్లిగేషన్లు, తనపై మోపబడిన నేరాలకు సంబంధించి స్వతంత్ర, నిష్పక్షపాత న్యాయస్థానంలో సరసమైన, బహిరంగ వాదనకు ప్రతి ఒక్కరూ అర్హులై ఉన్నారు.

11. బహిరంగ విచారణలో చట్ట ప్రకారం నేరం ఋజువయ్యేంత వరకు నేరం చేశాడని చెప్పబడే ప్రతి వ్యక్తినీ నిర్దోషిగానే భావించాలి.

12. ఎవరి ఏకాంతం, కుటుంబం, ఉత్తర ప్రత్యుత్తరాల్లో ఆర్బిట్రరీగా కలుగజేసుకోరాదు. ఎవరి గౌరవం, పేరు ప్రఖ్యాతులపై దాడి జరుపరాదు. అలాంటి జోక్యాలు లేదా దాడుల నుండి చట్ట సంరక్షణ పొందే హక్కును ప్రతి ఒక్కరూ కలిగి ఉన్నారు.

13. దేశ సరిహద్దుల లోపల స్వేచ్ఛగా వెళ్లగలిగే, నివాసం ఏర్పరచుకొనే హక్కును కలిగి ఉన్నారు. అలానే ఏ దేశాన్నైనా విడిచి వెళ్లడం లేదా తిరిగి రావడానికి హక్కును కలిగి ఉన్నారు.

14. విచారణ నుండి తప్పించుకొనేందుకు ఇతర దేశాల్లో ఆశ్రయం పొందే హక్కును కలిగి ఉన్నారు.

15. ప్రతి ఒక్కరూ జాతీయత హక్కును కలిగి ఉన్నారు.

16. జాతి, జాతీయత లేక మతం కారణంగా ఎలాంటి పరిమితి లేకుండా

పరిపూర్ణ వయసులో పురుషులు, స్త్రీలు వివాహం చేసుకొనే, కుటుంబాన్ని ఏర్పాటు చేసుకొనే హక్కు వుంది. .

17. ఒంటరిగా లేదా ఇతరులతో కలిసి ఆస్తిని కలిగి ఉండే హక్కు ఉంటుంది.

18. ఆలోచన, చేతనత్వం, మత స్వేచ్ఛా హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది.

19. అభిప్రాయం, భావవ్యక్తీకరణ స్వేచ్ఛ ఉంటుంది.

20. శాంతియుతంగా సమావేశాలు నిర్వహించుకోవడానికి సంఘాలు ఏర్పరచుకోవచ్చు.

21. ప్రతి ఒక్కరు వారి దేశ ప్రభుత్వ పాలనలో పాలు పంచుకోవచ్చు.

22. సమాజంలో సభ్యునిగా సామాజిక రక్షణ పొందే హక్కు ఉంది.

23. పనిచేయడానికి, ఉద్యోగాన్ని స్వేచ్ఛగా ఎంపిక చేసికోడానికి, పనికి అనుకూలమైన పరిస్థితులను కలిగి ఉండటానికి, నిరుద్యోగం నుండి రక్షణ పొందడానికి ప్రతి ఒక్కరికి హక్కు ఉంది. ఎలాంటి వివక్షత లేకుండా సమాన పనికి సమాన వేతనం పొందే హక్కు ఉంది. తమ అభిరుచుల సంరక్షణకు ట్రేడ్ యూనియన్ల స్థాపనకు, వాటిలో చేరడానికి హక్కు ఉంది.

24. పని గంటల పరిమితి, జీతంతో కూడిన శలవులతో సహా విశ్రాంతి, విరామ సమయం పొందే హక్కు ఉంది.

25. తన, తన కుటుంబ ఆరోగ్యం, సంక్షేమ కోసం ఆహారం, బట్టలు, గృహవసతి, వైద్య సంరక్షణ, ఇతర అత్యవసర సామాజిక సేవలతో సహా ప్రామాణిక జీవనానికి అవసరమైన అన్నింటిని పొందే హక్కు ఉంది.

26. ప్రతి ఒక్కరికి విద్యా హక్కు ఉంది. కనీసం ప్రాథమిక, ఆధార స్థాయిల వరకు విద్య ఉచితంగా అందించబడాలి. ప్రాథమిక విద్య నిర్బంధంగా ఉండాలి. సాంకేతిక, వృత్తి విద్య అందరికీ సాధారణంగా లభించాలి. ప్రతిభప్రాతిపదికగా ఉన్నత విద్య అందరికీ అందుబాటులో ఉండాలి. విద్య మానవ మూర్తిమత్వ పరిపూర్ణ వికాసం కోసం నిర్దేశించబడాలి. మానవ హక్కులు, ప్రాథమిక స్వేచ్ఛల పట్ల గౌరవాన్ని పటిష్ట పర్చేదిగా ఉండాలి. అది అన్ని దేశాలు, జాతి లేక మత సమూహాల మధ్య సహనం, స్నేహాన్ని పెంపొందించాలి. శాంతిని కాపాడటంలో యునైటెడ్ నేషన్స్ చర్యలను ముందుకు తీసుకుపోయేదిగా ఉండాలి.

27. సముదాయ సాంస్కృతిక కార్యకలాపాల్లో స్వేచ్ఛగా పాల్గొనడానికి, కళలను ఆస్వాదించడానికి, శాస్త్రీయ ప్రగతిని దాని ఫలితాలను అనుభవించడానికి ప్రతి ఒక్కరికీ హక్కుంది. శాస్త్ర భాష లేక కళా ఉత్పత్తి పరంగా ఉత్పన్నమయ్యే నైతిక, భౌతిక అభిరుచులని కాపాడుకొనే హక్కు ఉంది.

28. ఈ ప్రకటనలోని హక్కుల్ని, స్వేచ్ఛల్ని సాధించేందుకు సామాజిక, అంతర్జాతీయ వ్యవహారాల్లో పాల్గొనడానికి ప్రతి వ్యక్తి అర్హుడే.

29. తన మూర్తిమత్వం స్వేచ్ఛగా, పరిపూర్ణంగా అభివృద్ధి చెందడానికి సమాజం పట్ల ప్రతి ఒక్కరికీ బాధ్యతలు ఉన్నాయి.

30. ఈ ప్రకటనలోని హక్కులు, స్వేచ్ఛలను విచ్ఛిన్నం చేయడానికి ఏ దేశం, సమూహం లేదా వ్యక్తి ఎలాంటి పనిలో నిమగ్నంకాకూడదు. ఎలాంటి కార్యాన్ని నిర్వర్తించరాదు.



# మహిళా సంఘాలకు డిజిటల్ శక్తి

మహిళా సంఘాలకు డిజిటల్ శక్తి తోడవుతోంది. త్వరితగతిన మెరుగైన సేవలు, సమాచారం నిమిత్తం ప్రభుత్వం కొత్త యాప్‌లను అందుబాటులోకి తేనుంది. మహిళలు, మెప్మా అధికారులు, సిబ్బందికి కొత్త యాప్‌లు అందుబాటులో ఉంటాయి.

ఈ యాప్ ద్వారా మహిళా సంఘాల సమావేశాలు, తీసుకున్న నిర్ణయాలు, నిర్వహించిన కార్యక్రమాలు నమోదు చేస్తారు. దీనితో ఆయా సంఘాల కార్యకలాపాలు నేరుగా ఉన్నతాధికారులకు చేరే అవకాశం ఉంది. ఇప్పటి వరకు పుస్తకాల్లో నమోదు చేసుకునే వివరాలు ఇక నుంచి యాప్‌లో నమోదు చేయవలసి ఉంటుంది.

ఇతర ప్రాంతాల నుంచి పనుల కోసం వచ్చిన కూలీలు, తదితరులతో పాటు రాత్రి వేళ

షాపుల వద్ద, బస్టాండ్, రైల్వేస్టేషన్ల వద్ద పడుకునేవారి వివరాలను యాప్‌లో నమోదు చేస్తారు. వారికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన షెల్టర్‌లో ఉండేవిధంగా చర్యలు చేపడతారు. గతంలో పట్టణాల్లో సర్వేచేసి వివరాలు నమోదు చేశారు. స్వయం సహాయక మహిళా సంఘాల రికార్డులను తీసుకుని రుణాల కోసం బ్యాంకు అధికారుల వద్దకు వెళ్లేవారు. ఈ యాప్‌లో రుణం కోసం సంఘ సభ్యుల తీర్మానం, కావలసిన రుణం వివరాలను నమోదు చేస్తే సంబంధిత బ్యాంకు అధికారులకు చేరుతుంది. దీనివల్ల రుణ మంజూరు సులభమవుతుంది. మెప్మా సమాచారం ఇప్పటివరకు అందుబాటులో లేదు. ఇప్పుడు ఈ యాప్‌ద్వారా ఏ సమాచారం కావలసిన వెంటనే తెలుసుకునే అవకాశం ఉంటుంది. మెప్మా ద్వారా అందించే పథకాలు, రుణాలు, సిబ్బంది వివరాలను ఇందులో పొందుపరచనున్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల వివరాలను ఆర్‌పిలు యాప్‌లో నమోదు చేసిన వెంటనే ప్రాజెక్టు ఆఫీసర్ లాగిన్‌కు చేరతాయి. సంబంధిత అధికారి పరిశీలన అనంతరం టౌన్ సీఎంఎంకు చేరుతుంది. ఆ వివరాలు జిల్లా ప్రాజెక్టు ఆఫీసర్, రాష్ట్ర స్థాయి అధికారులకు అందుబాటులో ఉంటాయి. క్షేత్రస్థాయిలో మహిళా సంఘాల పర్యవేక్షణ సులభతరం అవుతుంది. యాప్‌ల వినియోగంపై అవగాహన కల్పించేందుకు మునిసిపాలిటీల వారీగా శిక్షణ ఇవ్వనున్నారు. ఇప్పటికే జిల్లాస్థాయి అధికారులకు శిక్షణ పూర్తయింది. యాప్ ఉపయోగించడం, వివరాల నమోదు, ఇబ్బందులుంటే ఎలా సంప్రదించాలనే అంశాలపై శిక్షణ ఇచ్చారు.



# Form - IV

## (See Rule 8)

Statement about ownership and other particulars of the UDBHAVA Telugu Monthly, Hyderabad, as required under Rule 8 of the Registration of News Paper (Central) Rules, 1956.

| | | |
|---|---|---|
| 1. Place of Publication | : | Hyderabad |
| 2. Periodicity of Publications | : | Monthly |
| 3. Printer's Name | : | M. Madhava Vasu |
| Whether Citizen of India? | : | Yes |
| Address | : | 1-24-21/4, (24-387), Plot No.1,<br>Sri Sai Nagar, Lothukunta,<br>Alwal, Secunderabad - 500 015 |
| 4. Publisher's Name | : | M. Madhava Vasu |
| Whether Citizen of India? | : | Yes |
| Address | : | 1-24-21/4, (24-387), Plot No.1,<br>Sri Sai Nagar, Lothukunta,<br>Alwal, Secunderabad - 500 015 |
| 5. Editor's Name | : | M. Madhava Vasu |
| Whether Citizen of India? | : | Yes |
| Address | : | 1-24-21/4, (24-387), Plot No.1,<br>Sri Sai Nagar, Lothukunta,<br>Alwal, Secunderabad - 500 015 |
| 6. Name and address of Individuals who own the Newspaper | : | M. Madhava Vasu |
| | : | 1-24-21/4, (24-387), Plot No.1,<br>Sri Sai Nagar, Lothukunta,<br>Alwal, Secunderabad - 500 015 |

I, M. Madhava Vasu, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/-

**M. Madhava Vasu**
(Publisher)